

మరణించిన కార్యకర్తల ఆత్మశాంతి కోసం మౌనం పాటిస్తున్న నాయకులు



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులు

కార్యకర్తలకు అండగా ఉంటా!

40 రోజుల్లో 40 ఏళ్ల అనుభవజ్ఞుడిని ఓడించాం

ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

మినీ మహానాడులో ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. నగరంలోని కమ్మ భవన్‌లో నియోజకవర్గ మినీ మహానాడును మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గడిచిన రెండేళ్లల్లో చనిపోయిన కార్యకర్తల ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. వైసీపీ హయాంలో టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టు తర్వాత పార్టీ ఉంటుందో.. లేదోనన్న చర్చ జరిగిందని, ఆ స్థాయి నుంచి 164 స్థానాల్లో విజయం సాధించి, వైసీపీని నేలమట్టం చేసేదాకా ఎదిగామని అన్నారు. దీనికి ప్రధాన కారణం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ అని అన్నారు. అర్బన్‌లో కేవలం 40 రోజుల ముందు ఎన్నికల బరిలో దిగి 40 ఏళ్ల అనుభవమున్న నాయకుడిని ఓడించానన్నారు. పార్టీలో కష్టపడిన ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని, ఖచ్చితంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ సభ్యత్వం కోసం కేవలం రూ.100 కడితే రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పించామని, అర్బన్‌లో ఐదుగురు కార్యకర్తల కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున బీమా పరిహారం అందిచామని అన్నారు. గత ఐదేళ్లలో అర్బన్‌లో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. రాప్తాడు, అనంతపురం అర్బన్‌లో ఇద్దరు ఎమ్మెల్యేలున్నా రుద్రంపేట రోడ్డు పూర్తి చేయలేకపోయారని, తాను ఎమ్మెల్యే అయ్యాకే పూర్తి చేశామని అన్నారు. ఈ 11 నెలలలో 165 మంది బాధితులకు రూ.2 కోట్లు సీఎంఆర్ఎఫ్ నిధులు అందజేశామని తెలిపారు. అనంతపురంలో ఇప్పటికే రూ.35 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించామని, మరో రూ.30 కోట్ల పనులు త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. రూ.750 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రూ.80 కోట్లతో నడిమి వంకకు ప్రొటెక్షన్ వాల్‌ను త్వరలోనే నిర్మిస్తామని తెలిపారు. అక్టోబరు 2 నాటికి గుత్తి రోడ్డులోని డంపింగ్ యార్డులో చెత్త లేకుండా చేస్తామని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్నామని అన్నారు. అర్బన్ నియోజకవర్గంలో గ్రూపులకు తావులేదని, ఇక్కడ చంద్రబాబు గ్రూపు మాత్రమే ఉందని అన్నారు. ఇప్పటికే చాలా మందికి నామినేటెడ్ పదవులు వచ్చాయని, కూటమి భాగస్వామ్యంలో బీజేపీ, జనసేన నాయకులకు పదవులు దక్కాయని అన్నారు. కాస్త సమయం తీసుకున్నా.. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. పార్టీలో చిన్న కార్యకర్త నుంచి తన దాకా అందరూ సమానమేని, పార్టీ కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.



ప్రజల్లో సంతృప్తి: అంబికా



టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న అభివృద్ధిపై ప్రజల్లో సంతృప్తి కనిపిస్తోందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. వైసీపీ హయాంలో ధ్వంసమైన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు తిరిగి గాడిలో పెడుతున్నారని అన్నారు. మంత్రి నారా లోకేశ్ దావోస్‌కు వెళ్లి రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తెచ్చి, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను తీరుస్తున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి, ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తున్నారని అన్నారు. కడపలో జరిగే మహానాడుకు జిల్లా నుంచి పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అనంతపై అభిమానం..



జిల్లాపై సీఎం చంద్రబాబుకు ప్రత్యేక అభిమానం ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. గుంతకల్లు నియోజకవర్గంలో ఇటీవల మంత్రి నారా లోకేశ్ రెన్యూ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, ఈ ప్రాజెక్టు ద్వారా 1500 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. సీఎం చంద్రబాబు గతంలో ఉమ్మడి జిల్లాకు కియను తెచ్చారని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నారని అన్నారు. కర్నూలు నుంచి బెంగుళూరు దాకా ఐటీ కారిడార్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని అన్నారు. తద్వారా జిల్లాలో యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని అన్నారు.

-వెంటకశివుడు యాదవ్



ఇవీ తీర్మానాలు

మినీ మహానాడులో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, డంపింగ్ యార్డు నగరానికి దూరంగా తరలింపు, నడిమి, మరువ వంకలకు ఇరువైపులా ప్రొటెక్షన్ వాల్స్ నిర్మించడం, అనంతపురం నగరానికి ఎలక్ట్రికల్ బస్సుల కోసం ప్రతిపాదనలు, బీసీ భవన్, కాపు భవన్, వైశ్య భవన్, పద్మశాలి భవన్, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల భవనాల ఏర్పాటు, అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయ నిర్మాణం.

చిత్తశుద్ధితో పనిచేస్తారు: లక్ష్మీనారాయణ



అనంతపురం అర్బన్‌లో పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసే నాయకులు, కార్యకర్తలు ఉన్నారని అనంతపురం అర్బన్ పరిశీలకుడు లక్ష్మీనారాయణ అన్నారు. గత ఎన్నికల్లో సీఎం చంద్రబాబు కొత్త వ్యక్తి దగ్గుపాటిని బరిలో నిలిపినా అత్యధిక మెజార్టీతో గెలిపించారని అభినందించారు. రాబోవు స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో నగరంలోని 50 వార్డులు, 4 పంచాయతీల్లో విజయం సాధించాలని అన్నారు. మేయర్ స్థానాన్ని మనమే దక్కించుకోవాలని, దీనికోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు.

హాజరైన నాయకులు

మినీ మహానాడులో మాజీ ఎంపీ కేఎం సైఫుల్లా, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళి, మాజీ మేయర్ స్వరూప, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రకాష్‌నాయుడు, నాయకులు ఎద్దులపల్లి సుబ్రహ్మణ్యం, తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, గంగారామ్, చౌదరి, సాలార్ బాషా, రాయల్ మురళి, సింగవరం రవి, కూచి హరి, సుధాకర్‌నాయుడు, స్వామిదాస్, సిమెంట్ పోలన్న, కుంచెపు వెంకటేశ్, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పరమేశ్వరన్, సరిపూటి రమణ, ఫిరోజ్ అహ్మద్, ముక్తియార్, సైఫుద్దీన్, గోపాల్ గౌడ్, లక్ష్మీనరసింహ, కొండవీటి భావన, స్వప్న, సంగా తేజస్విని, బల్లా పల్లవి, సరళ, నెట్టెం బాలకృష్ణ, చేపల హరి, మణికంఠ బాబు తదితరులు పాల్గొన్నారు.



నిధులిచ్చి.. సహకరించండి..!

● ముఖ్యమంత్రికి జేసీపీఆర్ వినతి



హోం మంత్రితో మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, మే 20(ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధులిచ్చి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు విన్నవించారు. అమరావతిలో సీఎం చంద్రబాబును ఆయన కార్యాలయంలో జేసీపీఆర్ కలిసి, తాడిపత్రి పరిస్థితులపై చర్చించారు. అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం హోం మంత్రి వంగలపూడి అనితను ఆమె చాంబర్‌లో కలిసి గత ఐదేళ్లలో నమోదైన అక్రమ కేసులను పరిశీలించి, ఎత్తివేయాలని కోరారు. అనంతరం తాడిపత్రిలో శాంతిభద్రతలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్రను కలిసి తాడిపత్రిలో పరిశ్రమలు మూతపడిన విషయంపై చర్చించినట్లు తెలిసింది. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కలిసి తాడిపత్రి అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. పురాతన ఆలయాలు దెబ్బతిన్నాయనీ, వాటిని కాపాడాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కోరారు. జేసీపీఆర్ వెంట ఎస్వీ రవీంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

సూపర్ లగ్జరీ అంట..!

● తాడిపత్రిలో మొరాయించిన ఆర్టీసీ బస్సు



బస్సును తోస్తున్న ప్రయాణికులు, ప్రజలు

తాడిపత్రి, మే20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దినసరి కూరగాయల మార్కెట్ వద్ద సీబీ రోడ్డులో ఆర్టీసీ బస్సు మొరాయించింది. అది.. పల్లె వెలుగో.. ఎక్స్‌ప్రెస్ అనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఏకంగా సూపర్ లగ్జరీ బస్సు ఆగిపోయింది. పట్టణంలోని డిపో నుంచి అనంతపురానికి బయల్దేరిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు కూరగాయల మార్కెట్‌వద్దకు రాగానే ఆగిపోయింది. అరగంటపాటు ముందుకు కదలకపోవడంతో ట్రాఫిక్ జామ్ అయి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరికి ప్రయాణికులు, ప్రజలు బస్సును రోడ్డు పక్కకు తోశారు. అనంతరం మెకానిక్ వచ్చి మరమ్మతులు చేయడంతో బస్సు బయల్దేరింది.

నెట్టికంటికి గంధ లేపనాలంకారం



గంధలేపనాలంకారంలో నెట్టికంటి ఆంజనేయుడు

గుంతకల్లు, మే 20(ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి విరాట్టుకు గంధంతో సర్వాంగ సుందరంగా అలంకారాలు చేశారు. మంగళవారం వేకువనే అర్చకులు స్వామివారి విరాట్టుకు అభిషేకాలను నిర్వహించి గంధ లేపనంతో అలంకరించారు. హనుమజ్జయంతి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో సుందరకాండ, మన్యుసూక్త, వేద పారాయణాలు గావించారు. శ్రీరామ ఆంజనేయ మూలమంత్ర అనుష్ఠానాలు, మన్యుసూక్త హోమాలు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహానికి సిందూరంతో లక్షార్చన, ఆరాధనలు, వేదగోష్ఠి నిర్వహించారు. రాత్రి ఎనిమిదిన్నర సమయంలో స్వామివారి ఉత్సవ విగ్రహానికి ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గంలో తిరంగా యాత్రపై ర్యాలీ చేపట్టిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

అందరి నినాదం.. ఏక్‌తా తిరంగ్

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మే 20(ఆంధ్రజ్యోతి): దేశ సైనికులకు సంఘీభావంగా మనందరి నినాదం ఒక్కటే.. ఏక్‌తా తిరంగ్ అని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. పట్టణంలో మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో తిరంగా ర్యాలీను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజావేదిక నుంచి వందలాది మంది జాతీయపతాకాన్ని చేతపట్టుకుని, భారత్ మాతాకీ జై అంటూ నినదిస్తూ వాల్మీకి సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పహల్గాంలో ఉగ్రవాదులు చొరబడి, 26 మంది పర్యాటకులను కాల్చి చంపారని అన్నారు. దీనికి ప్రతిగా ప్రధాని నరేంద్ర మోదీ ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టారని అన్నారు. సైనికుల సాహసంతో ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని అన్నారు. మన సైనికుల తెగువ, ధైర్య సాహసాలతో పాకిస్థాన్ తోక ముడిచిందని అన్నారు. కళ్లి తండాకు చెందిన మురళీ నాయక్ ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందారని, ఆ వీర జవానుకు మనమందరం ఘన నివాళులర్పించాలని అన్నారు. ఆయన ధైర్యసాహసాలు యువతకు ఆదర్శమని అన్నారు. ర్యాలీలో టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఏపీ ఐసెట్‌లో 93శాతం ఉత్తీర్ణత

టాప్10లో దక్కనిచోటు

అనంతపురం సెంట్రల్, మే 20(ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ ఐసెట్-2025లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు 93శాతం ఉత్తీర్ణత సాధించారు. సెట్ నిర్వాహకులు మంగళవారం ఫలితాలను విడుదల చేశారు. ఈనెల 7న నిర్వహించిన ఐసెట్ పరీక్షలకు 2,969 మంది విద్యార్థులు హాజరుకాగా 2,772 మంది పాసయ్యారు. ఉత్తీర్ణత శాతం 93.36గా నమోదైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

వీరిలో 1,499 మంది పురుషులకుగాను 1339 మంది, 1,470 మంది మహిళలకుగాను 1,373 మంది మంది ప్రవేశాలు పొందేందుకు అర్హత సాధించారు. రాష్ట్రస్థాయి టాప్ 10 ర్యాంకుల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఒక్కరు కూడా చోటు సంపాదించలేదు.

మహా ప్రాధాన్యం

● మహానాడు నిర్వహణలో ఉమ్మడి జిల్లా నేతలకు బాధ్యతలు

● అన్ని కమిటీల్లోనూ చోటు (వివరాలు 7వ పేజీలో...)

అవాక్కయ్యేలా..!

అపాయింట్‌మెంట్ ఆర్డర్లు లేకుండానే ఏళ్లుగా ఉద్యోగాలు

విచారణలో అడ్డంగా దొరికిన ల్యాబ్ టెక్నీషియన్లు

వైద్య కళాశాలలో నియామకాలపై దుమారం

అనంతపురం టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): అపాయింట్‌మెంట్ ఆర్డర్ లేకుండా ప్రభుత్వ శాఖలో ఉద్యోగంలో చేరడం అసాధ్యం. అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఉంటేనే సంబంధిత విభాగాల అధికారులు జాయిన్ చేసుకుంటారు. అనంత వైద్య కళాశాలలో ఇందుకు విరుద్ధంగా నియామకాలు జరగడం ఆశ్చర్యానికి లోనుచేస్తోంది. ల్యాబ్ టెక్నీషియన్ల నియామకాలే ఇందుకు నిదర్శనం. అపాయింట్‌మెంట్ ఆర్డర్లు లేకుండా ఉద్యోగంలో కొనసాగుతున్నట్లు తేలడం వైద్య కళాశాలలో తీవ్ర దుమారం రేపుతోంది.

ఏళ్లుగా..

వైద్య కళాశాలలో కొన్నేళ్లుగా ల్యాబ్ టెక్నీషియన్లను అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించుకుంటున్నారు. అందులో భాగంగా పలువురికి వివిధ దఫాల్లో నియామకం కల్పించారు. ఇష్టారాజ్యంగా నియామకాలు చేపట్టారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో వైద్య కళాశాల అధికారులు విచారణ చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం కళాశాల అడ్మినిస్ట్రేషన్ శ్యామ్‌ప్రకాష్‌ను ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు నియమించారు. ఆ మేరకు 2002 నుంచి ఇప్పటి వరకు ల్యాబ్ టెక్నీషియన్లుగా నియమితులైన వారందరూ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు తీసుకుని, విచారణకు రావాలని ఆదేశాలు జారీ చేశారు. 35 మంది వరకు విచారణకు వచ్చారు. 2002, 2011 మధ్య ఉద్యోగాల్లో చేరిన దాదాపు 15 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు లేవని తేలిపోయింది. వీళ్లందరూ ఏళ్లుగా వైద్య కళాశాలలో పనిచేస్తున్నారు. జీతాలు కూడా తీసుకుంటున్నారు. ఏనాడూ అపాయింట్‌మెంట్ ఆర్డర్ గురించి వైద్య కళాశాల అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి.

వింత వాదనలు

అపాయింట్‌మెంట్ ఆర్డర్లు లేకుండానే పనిచేస్తుండడంపై కళాశాల అధికారులు, ల్యాబ్‌టెక్నీషియన్లు వింత వాదనలు వినిపిస్తున్నారు. వారిని తాము నియమించుకోలేదనీ, గతం నుంచీ కొనసాగుతున్నారని ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు చెబుతున్నారు. బాధిత ల్యాబ్ టెక్నీషియన్లు మాత్రం తాము నియామకాల ఆర్డర్ మాన్యువల్‌గా ఇచ్చామనీ, ఇపుడు ఆ ఫైల్ కనిపించకుండా పోయిందని చెబుతున్నారన్నారు. 15 ఏళ్లకు పైగా పనిచేస్తున్నామనీ, ఇపుడు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు లేవనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని అనంతకు వచ్చిన డీఎంఈ నరసింహం, ప్రిన్సిపాల్ మాణిక్యాలరావును మంగళవారం ల్యాబ్ టెక్నీషియన్లు కలిసి విన్నవించుకున్నారు. ఏదిఏమైనా అపాయింట్‌మెంట్ ఆర్డర్లు లేకుండా ఉద్యోగాలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు అరకత్తెరలో పడ్డారు. వారిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి మరి.



ల్యాబ్ టెక్నీషియన్ల రికార్డులను పరిశీలిస్తున్న విచారణాధికారి శ్యామ్‌ప్రకాష్



వానలు ఫుల్..!

ఈ ఏడాది అధిక వర్షాలు

30నే నైరుతి రుతుపవనాల రాక

వాతావరణ శాఖ

బుక్కరాయసముద్రం, మే 20(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వానలే వానలు. దంచికొడతాయని వాతావరణ శాఖ సూచిస్తోంది. ఉమ్మడి జిల్లాను నైరుతి రుతుపవనాలు ముందుస్తుగా తాకనున్నాయి. ప్రస్తుతం అండమాన్ నికోబార్ తీరాన్ని తాకినట్లు ప్రకటించింది. అక్కడి నుంచి కేరళకు ఈనెల 26, 27 తేదీల్లో నైరుతి రుతుపవనాలు చేరే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో ముందుస్తుగానే ఉమ్మడి జిల్లాకు మే చివరి వారంలోనే నైరుతి రుతుపవనాలు తాకనున్నట్లు రేకలకుంట ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. ఈ ఏడాది అత్యధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే సూచించింది. ఇప్పటికే ఆరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత వారంలో ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతన్నలు సిద్ధమయ్యారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు ముందుస్తుగానే జిల్లాలోకి ప్రవేశించనుండడంతో రైతుల్లో ఖరీఫ్ సాగుపై ఆసక్తి పెరుగుతోంది. సాధారణం కంటే ఈ ఏడాది అధికంగా కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడు నారాయణస్వామి తెలిపారు. ఇప్పటికే పలుచోట్ల రైతులు లోతు దుక్కులు, పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ సీజన్‌లో జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సకాలంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపినట్లు శాస్త్రవేత్త నారాయణ స్వామి చెప్పారు. ఇది ఖరీఫ్ సాగు పనుల్లో నిమగ్నమైన అన్నదాతలకు పండగ లాంటి సమాచారం.

రానున్న మూడు రోజులు వర్షాలు

ఉమ్మడి జిల్లాలో రానున్న మూడు రోజులు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. ప్రస్తుతం ఆరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో వర్షాలు కురుస్తాయన్నారు. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసే అవకాశం ఉందన్నారు. 12-13 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

వేసవి దుక్కులు చేసుకోండి

ఉమ్మడి జిల్లాలో వారం రోజులుగా పలు చోట్ల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భూమిలో ఉన్న తేమను వినియోగించుకుని వేసవి దుక్కులు చేసుకోవాలని శాస్త్రవేత్త నారాయణ స్వామి తెలిపారు. దుక్కులు చేసుకోవడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. రాబోవు సీజన్‌లో కలుపు, తెగులు, వ్యాధుల ఉధృతి తగ్గే అవకాశం ఉందన్నారు. ఖరీఫ్‌లో సాగుచేసుకునే పంటకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వరిసాగు చేసే, కోత కోసిన రైతులు ప్రస్తుతం ఉన్న తేమను వినియోగించుకుని, పచ్చిరొట్ట ఎరువులను వేసుకోవాలి. పచ్చిరొట్ట పైర్లను సాగు చేయడానికి వర్షాకాలం ఎంతో అనువైనదన్నారు. రైతులు తొలకరి వర్షాలను వినియోగించుకుని పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలన్నారు. తేమను వినియోగించుకుని వేసవి దుక్కులు చేసుకోవాలని ఆయన సూచించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

లక్ష్మీనారసింహుడికి ఘనంగా పూజలు

ఆమిద్యాలకు పయనమైన ఉత్సవ విగ్రహాలు



ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ఉరవకొండ, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈనెల 9న ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. 12రోజులపాటు ఉత్సవాలు వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆనవాయితీ ప్రకారం ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాల మధ్య ఊరేగింపుగా ఆమిద్యాలకు తీసుకెళ్లారు. ఆమిద్యాలలోని పెన్నోబులేశుడి ఆలయంలో ఉత్సవ విగ్రహాలను ఉంచారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమేష్‌బాబు, అర్చకులు ద్వారకనాథాచార్యులు, సిబ్బంది దీపక్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు హుండీలోకి వేసిన సొమ్ము, కానుకలను మంగళవారం లెక్కించారు. బ్రహోత్సవాల పర్యవేక్షణ అధికారి పాండురంగారెడ్డి, దేవదాయ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి పర్యవేక్షణలో హుండీలను తెరచి, లెక్కించారు. మొత్తం రూ.15.85 లక్షల హుండీ ఆదాయం వచ్చినట్లు ఈవో రమేష్‌బాబు తెలిపారు. అన్నదాన హుండీ ద్వారా 8,212 వచ్చిందన్నారు.

ఎన్నాళ్లీ నిర్లక్ష్యం

సొంత భవనంలేని జలవనరుల శాఖ





ఇరుకు గదిలోనే హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయం, హెచ్చెల్సీ స్థలంలో నిర్మాణం పూర్తయిన వైసీపీ కార్యాలయం

గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు బుట్టదాఖలు

హెచ్చెల్సీ స్థలాన్ని వైసీపీకి అప్పగించిన అధికారులు

అభివృద్ధి పనులు జరుగుతున్న వేళ పలు పోస్టులు ఖాళీ

ఈ ప్రభుత్వంలోనైనా జలవనరుల శాఖపై నిర్లక్ష్యం వీడేనా..?

అనంతపురం క్లాక్‌టవర్, మే 20(ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖకు సొంత కార్యాలయ భవన నిర్మాణం కలగానే మిగిలింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో జలవనరుల శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారు. ప్రధానంగా హెచ్చెల్సీ, హంద్రీనీవా ప్రాజెక్ట్‌లను గాలికొదిలేశారు. పైగా వైసీపీ కార్యాలయ నిర్మాణం కోసం హెచ్చెల్సీకి సంబంధించిన రెండు ఎకరాలు ఆక్రమించారు. నగరంలోని తెలుగుతల్లి కూడలిలో ఉన్న హెచ్చెల్సీ ఎస్ఈ కార్యా లయాన్ని 2021లో ఉన్నఫలంగా ఖాళీ చేయించారు. గత మూడెన్నరేళ్లుగా మూడు గదుల్లో కార్యాలయం నిర్వహిస్తున్నారు. వైసీపీ పాలనలో జలవనరుల శాఖ కార్యాలయ నిర్మాణం కోసం మూడుసార్లు జిల్లా ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేశారు. గత ఏడాది నూతన ప్రభుత్వం కొలువుదీరడంతో కార్యాలయ నిర్మాణంపై ఉద్యోగుల్లో ఆశలు చిగురించాయి. గత నెలలో హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ ఉద్యోగ విరమణ చేయడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. హెచ్చెల్సీలోని గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ), ధర్మవరం బ్రాంచ్ కెనాల్ (డీబీసీ) రెండు డివిజన్లకు ఇన్‌చార్జ్‌లే దిక్కయ్యారు. హెచ్చెల్సీలో కీలకంగా ఉండే లోకలైజేషన్ ఈఈ ఈ నెలాఖరులో ఉద్యోగ విరమణ చేయనున్నారు. అది కూడా ఖాళీ అవుతుంది. హంద్రీనీవాలో ఎస్ఈతోపాటు డివిజన్ 5, డివిజన్ 7, పెనుకొండ డివిజన్లకు ఇన్‌చార్జి ఇంజనీర్లే కొనసాగుతున్నారు. వెంటనే రెగ్యులర్ ఇంజనీర్లను నియమించి ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కీలక పోస్టులు ఖాళీ

జలవనరుల శాఖలో కీలక పోసులు ఖాళీగా ఉన్నాయి. గతనెల 30న హెచ్చెల్సీ ఎస్ఈగా ఉన్న రాజశేఖర్ రిటైర్డ్ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. హెచ్చెల్సీలో సుమారు రూ.50కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో కీలకంగా ఉండే ఎస్ఈ పోస్టు ఖాళీగా ఉండటం విమర్శలకు దారితీస్తోంది. హెచ్చెల్సీ పరిధిలోని ధర్మవరం కెనాల్ డివిజన్, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ డివిజన్‌లు రెండింటికీ ఇన్‌చార్జి ఈఈలే కొనసాగుతున్నారు. హెచ్చెల్సీలో కీలకంగా ఉండే లోకలైజేషన్ డివిజన్ ఈఈ వెంకటరమణారెడ్డి కూడా ఈనెలాఖరులో ఉద్యోగవిరమణ చేయనున్నారు. హంద్రీనీవాలో ఎస్ఈ పోస్టు, డివిజన్ 5, 7, పెనుకొండ డివిజన్‌లలోనూ ఇన్‌చార్జి ఈఈలే కొనసాగుతున్నారు. ప్రస్తుతం హంద్రీనీవాలో సుమారు రూ.1400కోట్లతో హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు, లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కీలక పోస్టులలో ఇన్‌చార్జిలు కొనసాగుతుండటంపై పలువురు పెదవి విరుస్తున్నారు.

మూడు ముక్కలుగా హెచ్చెల్సీ కార్యాలయం

హెచ్చెల్సీ కార్యాలయాన్ని మూడు ముక్కలు చేశారు. సుమారు 20ఎకరాలకు పైగా సొంత స్థలం ఉన్నా సొంత భవనం నిర్మించుకోలేని దుస్థితిలో హెచ్చెల్సీ శాఖ ఉంది. కొన్నేళ్ల కిందట నగరంలోని తెలుగుతల్లి కూడలిలో ఉన్న హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయాన్ని బలవంతంగా ఖాళీ చేయించారు. 2021లో ఉన్న ఫలంగా అక్కడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి విస్తరణ నిర్మాణాలు చేపట్టాలని అప్పటి అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే ఒత్తిడితో ఖాళీ చేశారు. సొంత స్థలం ఉన్న హెచ్చెల్సీ కాలనీలో ఏదో ఒక చోట కార్యాలయం నిర్మించుకోవచ్చు అనుకున్నారు. అయితే హెచ్చెల్సీ కాలనీలో ఎస్ఈ కార్యాలయాన్ని ఒక చోట, డిప్యూటీ ఎస్ఈ ఒక చోట, మిగిలిన సిబ్బంది, రికార్డుల కోసం ఒక గదిని కేటాయించారు. దీంతో హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయం మూడు ముక్కలు అయ్యింది. అయితే ఇంతవరకు సొంత భవనానికి సంబంధించి నిధులు, నిబంధనలు జారీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆశాఖ ఉద్యోగులు వాపోతున్నారు. జలవనరుల శాఖ సీఈ కార్యాలయం నిర్మించాలని రెండెకరాల స్థలంలో కాంపౌండ్ వాల్ నిర్మించారు. మట్టి తవ్వి వదిలేశారు.



హంద్రీనీవా కార్యాలయం

హెచ్చెల్సీ స్థలంలో వైసీపీ కార్యాలయం

అధికారంలో ఉన్న సమయంలో వైసీపీ విలువైన హెచ్చెల్సీ స్థలంలో రెండెకరాల స్థలాన్ని తమ పార్టీ కార్యాలయం కోసం తీసుకుంది. జలవనరుల శాఖ ఇంజనీర్లు నిబంధనలకు విరుద్ధంగా స్థలాన్ని ఓ పార్టీకి అప్పగించడం సాధ్యం కాదని చెప్పినా, రాష్ట్రస్థాయిలో అప్పటి వైసీపీ వీరభక్తుడిగా ఉన్న జలవనరుల శాఖ ఈఎన్సీ నారాయణరెడ్డి ఒత్తిడితో సుమారు 2 ఎకరాల స్థలాన్ని అప్పగించారు. ఏడాదికి రూ.1000 నామమాత్రపు అద్దెతో లీజుకు తీసుకున్నారు. 33ఏళ్ల పాటు ఈ స్థలం వైసీపీ అద్దెకు తీసుకుంది. వైసీపీ కార్యాలయ భవనం నిర్మాణం వేగంగా పూర్తి చేశారు. అదే సమయంలో జలవనరుల శాఖ కార్యాలయం మాత్రం ప్రహరీకే పరిమితమైంది.

ప్రతిపాదనలు పంపాం



జలవనరుల శాఖ కార్యాలయం కోసం మూడేళ్ల కిందట మూడు సార్లు ప్రతిపాదనలు పంపాం. హెచ్చెల్సీ స్థలంలో ఒకటిన్నరెకరా స్థలంలో జలవనరుల శాఖ కార్యాలయం నిర్మాణం చేపట్టేందుకు రూ.14కోట్లతో ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు అందజేశాం. మూడుసార్లు గత ప్రభుత్వంలో సిద్ధం చేసిన ప్రతిపాదనలు జలవనరుల శాఖకు పంపించాం. ఒక్కసారి కూడా అక్కడ నుంచి ప్రతిస్పందన రాలేదు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వానికి తాజాగా ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాం. ఇక హెచ్చెల్సీ ఎస్ఈ స్థానంలో కొత్త అధికారిని త్వరలోనే నియమిస్తారు. ఇన్‌చార్జిలుగా పలు చోట్ల ఇంజనీర్లు కొనసాగుతున్నారు. అయితే ఎక్కడా పనులు ఆగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

-నాగరాజ,
జలవనరుల శాఖ సీఈ

గుడ్లు తేలేయాల్సిందే..!

చిన్నారుల పౌష్టికాహారంలో కక్కుర్తి

తవ్వేకొద్దీ బయటికొస్తున్న అక్రమాలు

తూతూమంత్రంగా అప్పటి ఆర్డీడీ నివేదిక

లక్షల్లో కోడిగుడ్లు స్వాహా

వైసీపీ హయాంలో యథేచ్ఛగా దోపిడీ పర్వం




కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం

> **వైసీపీ హయాంలో అక్రమాలకు అడ్డే లేకుండాపోయింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పంపిణీ చేసే కోడిగుడ్లనూ కక్కుర్తికి పాల్పడ్డారు. అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై కోడిగుడ్లను పక్కదారి పట్టించి స్వాహా చేశారు. అక్రమార్కులకు అప్పటి ప్రజాప్రతినిధి, ఉన్నతాధికారి కూడా సహకారం అందించినట్లు తాజాగా వెలుగుచూస్తోంది. అక్రమాలను బయటకు రాకుండా తొక్కిపెట్టినట్లు తెలుస్తోంది.**

కళ్యాణదుర్గం, మే 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో వచ్చిన కరోనాను అడ్డుపెట్టుకుని ఐసీడీఎ్‌సలో ఇష్టారాజ్యంగా అక్రమాలకు తెరలేపారు. చిన్నారులకు పంపిణీ చేయాల్సిన లక్షల కోడిగుడ్లు, పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టించి స్వాహాచేశారు. తాజాగా విచారణ చేస్తుండడంతో ఏ స్థాయిలో అక్రమాలు జరిగాయో చూసి అంగన్‌వాడీ కార్యకర్తలు గుడ్లు తేలేస్తున్నారు. అధికారుల మాట కాదనలేక వారు అడిగిన విధంగా సమాధానాలు రాసి ఇస్తున్నారు. 2020 సంవత్సరంలో కోడిగుడ్ల సరఫరాలో జరిగిన అక్రమాలు అధికారుల మెడకు చుట్టుకుంటున్నాయి. అప్పట్లో పనిచేసిన అధికారులు, ఓ ప్రజాప్రతినిధి, కాంట్రాక్టర్ కుమ్మక్కై లక్షల్లో కోడిగుడ్లను మాయం చేసేసి, ఆ సొమ్మును స్వాహా చేసినట్లు తెలుస్తోంది. అప్పట్లో కళ్యాణదుర్గం ఆర్డీవోగా పనిచేసిన నిశాంత్‌రెడ్డి కోడిగుడ్ల పంపిణీ గోల్‌మాల్‌పై విచారణ చేసి ప్రభుత్వానికి నివేదికను అందచేశారు. కానీ ఆయన నివేదికపై కూడా విమర్శలు రావడంతో ప్రస్తుత ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ప్రజాప్రతినిధి చెప్పినట్లే ఆర్డీఓ నివేదిక ఇచ్చారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన కోడిగుడ్లపై కర్నూలు ఆర్జేడీ కార్యాలయ సూపరింటెండెంట్ మంజులవాణి, సీనియర్ అసిస్టెంట్ షెక్షావలి ఈనెల 14న విచారణ చేపట్టారు. వారు కూడా తూతూ మంత్రంగా విచారణ చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఓ అధికారిని కాపాడేందుకు ఇలా మొక్కుబడిగా విచారణ చేశారని తెలుస్తోంది.

అప్పటి ప్రజాప్రతినిధి అండతోనే..

కరోనా ఉధృతంగా వేళ.. 2020లో కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల్లో చాలా చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకోలేదు. కోడిగుడ్లు అరకొరగా సరఫరా చేసి, మిగతా వాటిని పక్కదారి పట్టించారని తెలుస్తోంది. ఇదంతా అప్పటి ఓ ప్రజాప్రతినిధి కనుసైగల్లోనే సాగిందన్న విమర్శలు ఉన్నాయి. ఆ ప్రజాప్రతినిధి ఎలా చెబితే అలా నడుచుకుంటూ స్వాహాకు తెరలేపారని తెలుస్తోంది. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల్లో 31.48 లక్షల కోడిగుడ్లు సరఫరా చేశారు. వీటికి ఏ మాత్రం లెక్కలు లేవు. ఆన్‌లైన్ నమోదుకు, క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తల నమోదుకు భారీ వ్యత్యాసం ఉంది. దీంతోనే అక్రమాలు బయటపడ్డాయి. కోడిగుడ్లతో పాటు కిట్లు, బియ్యం, కందిబేడలు, నూనె తదితర సరుకులను అక్రమంగా తరలించి అమ్ముకున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇలా లక్షలాది రూపాయలు అవినీతి జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. 2020 ఏప్రిల్, మే, జూన్, ఆగస్టు మాసాల్లోనే ఈ అక్రమాలు జరిగాయని విచారణ అధికారులు అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో తూతూ మంత్రంగా విచారణ చేసి, వారికి అనుకూలంగా నివేదికలు తయారు చేసుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అక్రమాలపై పునఃవిచారణ చేయడంతో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి.



విచారణ అధికారులు తయారు చేసిన ఐదు ప్రశ్నలు



ఈనెల 14న విచారణకు వచ్చిన కర్నూలు ఆర్జేడీ కార్యాలయ సిబ్బంది (ఫైల్)

క్షేత్రస్థాయికి వెళ్లకుండా విచారణ

కోడిగుడ్ల అక్రమాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేయాల్సిన ఆర్జేడీ కార్యాలయ అధికారులు ఐసీడీఎస్ కార్యాలయంలోనే ముగించడంపై అనుమానాలు కలుగుతున్నాయి. ఐదు ప్రశ్నలు వేసి, వాటికి అవును...అవును... అంటూ సమాధాన్ని రాయించుకోవడంపై విచారణ సక్రమంగా చేపట్టలేదన్న అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి రికార్డులను పరిశీలించి వాటి ఆధారంగా వివరాలు సేకరించాల్సిన అధికారులు.. కార్యకర్తలను కంబదూరు కార్యాలయానికి పిలిపించుకుని విచారణ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పిల్లల పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టించిన అధికారులపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

సర్వజనాస్పత్రిలో మల్టీలెవల్ పార్కింగ్

పనులు ప్రారంభం

తీరనున్న పార్కింగ్ సమస్య

అనంతపురం టౌన్, మే20(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రిలో మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. పార్కింగ్ లేక ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలిపేస్తున్నారు. దీంతో అత్యవసర కేసులను ఆస్పత్రిలోకి తీసుకెళ్లాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వైద్యుల కార్లు ఆస్పత్రి ఆవరణలో ఉంచుతుండడంతో రోగులకు అసౌకర్యంగా ఉంటోంది. ఏళ్లుగా పార్కింగ్ సమస్యతో సతమతమవుతున్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆస్పత్రికి వచ్చినపుడు ఇంజనీరింగ్ అధికారులతో పార్కింగ్ విషయమై చర్చించారు. నగర పాలక సంస్థ ఇంజనీర్లు మెట్రో సిటీల్లో ఏర్పాటు చేసిన మల్టీలెవల్ పార్కింగ్ గురించి వివరించారు. ఆస్పత్రి ఆవరణలో అలాంటి పార్కింగ్ ఏర్పాటుకు అనువుగా ఉందని నగర పాలక, ఏపీఎంఐడీసీమెడికల్ ఇంజనీర్లు సంయుక్తంగా కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. అందుకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. నిర్మాణవ్యయ బాధ్యతను నగర పాలక సంస్థకు అప్పగించారు. దీంతో మంగళవారం మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు పనులు మొదలు పెట్టారు. అండర్ గ్రౌండ్‌తోపాటు రెండు ఫ్లోర్లు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో ఫ్లోర్‌లో 12 నుంచి 13 వరకు కార్లు పార్కింగ్ చేసుకునే అవకాశం ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. దీంతో ఆస్పత్రిలో పార్కింగ్ సమస్య పరిష్కారమవుతుందని ఇంజనీరింగ్ వర్గాలు చెబుతున్నాయి.



జిల్లా ఆస్పత్రిలో ప్రారంభమైన మల్టీలెవల్ పార్కింగ్ పనులు

పని చేసే ఐడియా లేదా?



నిస్తేజంగా పోలీస్ ఐడీ పార్టీలు

జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు

రవాణాను అరికట్టడంలోనూ విఫలం

మత్తు కోసం యువత ప్రయోగాలు



జనవరిలో మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

అనంతపురం క్రైం, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి, పేకాట, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాల్సిన పోలీస్ ఐడీ పార్టీ నిస్తేజంగా మారింది. దీంతో జిల్లాలో గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. గంజాయి రవాణాను నిరోధించి, విక్రేతలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో గంజాయి వాడకం పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా సాగుతోంది. గంజాయి ఎక్కడి నుంచి జిల్లాలోకి తెస్తున్నారనేది తెలిసినా, మూలాలను నియంత్రించడంలో పోలీస్ శాఖ వైఫల్యమైంది. క్రైం, ఐడీ పార్టీలు నిస్తేజంగా మారడంతోనే గంజాయి రవాణా యథేచ్ఛగా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒడిశా, విశాఖ నుంచే...

జిల్లాలోకి గంజాయి ఒడిశా సరిహద్దు, విశాఖపట్నం పరిసర ప్రాంతాల నుంచి అధికంగా రవాణా అవుతోంది. దీని రవాణాకు 17ఏళ్ల లోపు బాలలను సైతం పంపుతున్నారు. చిన్నపిల్లలు కదా పోలీసులు అనుమానించరనే ఉద్దేశంతో ఇలా చేస్తున్నారు. కానీ వారు కూడా పలు సందర్భాల్లో పట్టుబడ్డారు. మహిళలు కొందరు నేరుగా గంజాయిని తెప్పించి విక్రయిస్తున్నారు. అక్కడ కిలో గంజాయి రూ.వెయ్యి నుంచి రూ.1500లకు వెచ్చించి కొనుగోలు చేసి, రైలులో తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. చిన్న ప్యాకెట్ సైతం రూ.300ల నుంచి రూ.500లకు విక్రయించి, జేబులు నింపుకుంటున్నారు. 20 ఏళ్ల యువకుల నుంచి 50ఏళ్ల వ్యక్తుల వరకు ఈ మత్తులో జోగుతున్నట్లు సమాచారం.

నిస్తేజంగా ఐడీ పార్టీలు...

జిల్లాలో చివరిసారిగా నాలుగు నెలల కిందట ఏడుగురు సభ్యులు గల గంజాయి ముఠాను అరెస్ట్ చేశారు. తర్వాత నగరంలోని ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా గంజాయి పట్టుబడలేదు. ఒక్కో పోలీస్‌స్టేషన్‌లో కనీసం ఇద్దరు ఐడీ సిబ్బంది పనిచేస్తున్నారు. నేరాలు చేసే వారిని పట్టుకోవడం, గంజాయి, మట్కా, పేకాటలాంటి వ్యవహారాలపై దృష్టి సారించడమే వీరి పని. నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏకంగా ఇద్దరు ఏఎస్ఐలు, ఓ హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు ఐడీపార్టీలో పని చేస్తున్నారు. మిగిలిన స్టేషన్లలో ఇద్దరు లేదా ముగ్గురు పనిచేస్తున్నారు. జిల్లాలోని తాడిపత్రిలోనూ గంజాయి రవాణా అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. ఇక్కడకు ఓ ఉన్నతాధికారిని కేటాయించినా పోలీసులు నియంత్రించలేకపోతున్నారు. గుంతకల్లు పట్టణం గంజాయి వినియోగం టాప్‌లో ఉందనే ఆరోపణలున్నాయి. రైల్వేస్టేషన్ కేంద్రంగా జిల్లాలోకి తొలుత గంజాయి ఇక్కడికే అధికంగా వస్తోందని సమాచారం. ఇక్కడ కూడా పోలీసులు సరిగా దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. కళ్యాణదుర్గం, రాయదుర్గంలతో పాటు పలు మండల కేంద్రాల్లో గంజాయి వినియోగిస్తున్నారు.

నిద్రమాత్రలనూ వదలని కుర్రకారు

గంజాయి సక్రమంగా దొరక్కపోవడం, చిన్న ప్యాకెట్ సైతం ఎక్కువ ధర పలుకుతుండటంతో అంత డబ్బు పెట్టి కొనలేని యువత నిద్ర మాత్రలను మింగుతున్నట్లు సమాచారం. వారి పర్సనాలిటీలను బట్టి రోజుకు ఒకటి లేదా రెండు మాత్రలు వేసుకుంటున్నట్లు తెలిసింది. ఇలాంటి వారు ఏదైనా నేరం చేసి జైలుకు వెళ్లిన సందర్భంలో అక్కడి అధికారుల ఆరాలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. వాస్తవానికి మెడికల్ షాపుల్లో డాక్టర్ చీటీ లేనిదే నిద్రమాత్రలు ఇవ్వరు. దీంతో కొందరు యువకులు ప్రైవేట్ ఆసుపత్రుల్లోని డాక్టర్ల లెటర్ ప్యాడ్‌లు దొంగిలించి, వాటిపై నిద్రమాత్రలకు సంబంధించిన ప్రిస్క్రిప్షన్ రాసుకుని మెడికల్ షాపుల్లో చూపి తీసుకుంటున్నట్లు తెలిసింది.

రైతుల సమక్షంలోనే చర్చిద్దాం..!

నేడే.. జీడిపల్లి రిజర్వాయర్ వద్దే..

బహిరంగ చర్చపై శివరామిరెడ్డికి కాలవ ఆహ్వానం



మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, మే 20(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవాపై సమగ్ర వివరాలతో బుధవారం ఉదయం 11 గంటలకు బహిరంగ చర్చకు జీడిపల్లి రిజర్వాయర్ వద్ద సిద్ధంగా ఉంటానని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంపై బురద చల్లుతున్న వైసీపీ నేత, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి చర్చకు రావాలని కాలవ ఆహ్వానించారు. రైతుల సమక్షంలో అన్ని విషయాలు చర్చిద్దామన్నారు. స్థానిక తన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశంలో బహిరంగ చర్చపై కాలవ స్పష్టత ఇచ్చారు. హంద్రీనీవాపై చర్చకు రావాలని పిలుపునిస్తే శివరామిరెడ్డి స్పందించారన్నారు. అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 21, 22 తేదీల్లో మీడియా సమక్షంలో చర్చలు జరపడానికి ఆహ్వానిస్తే ఆయన ఉరవకొండ నియోజకవర్గంలో చర్చకు సిద్ధమని అంగీకరించారన్నారు. ఆయన కోర్కె ప్రకారమే ఉరవకొండ నియోజకవర్గ పరిధిలో హంద్రీనీవాకు అత్యంత కీలకమైన జీడిపల్లి రిజర్వాయర్ వద్దనే చర్చించటానికి సిద్ధమన్నారు. ఆయన మాట ప్రకారమే బుధవారం ఉదయం 11 గంటలకు జీడిపల్లి వద్ద సిద్ధంగా ఆయన రాక కోసం ఎదురు చూస్తానన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు రూపకల్పన స్థాయి నుంచైనా, 1995 తరువాత మారిన ప్రభుత్వాల పాలనలోనైనా, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగిన పనులు అందులో అవినీతి, అక్రమాలపైనైనా, రోశయ్య పాలనలో రఘువీరారెడ్డి చనువుతో జరిగిన అభివృద్ధయినా, విజిలెన్స్, కాగ్ నివేదికలపైనైనా సరే మాట్లాడేందుకు తాను సిద్ధమని వివరించారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేయటానికి ఇదే మంచి అవకాశంగా తాను భావిస్తున్నానని కాలవ వివరించారు.

104 మంది..

వ్యవసాయ శాఖలో ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన వారి సంఖ్య

పలు కేడర్లలో 19 పోస్టులు ఖాళీ

జేడీఏ కార్యాలయంలో జాబితా ప్రదర్శన

ఎట్టకేలకు ఆన్‌లైన్‌లో బదిలీల ఆప్షన్

అనంతపురం అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా వ్యవసాయ శాఖలో 104 మంది అధికారులు, సిబ్బంది సర్వీస్ ఐదేళ్లు పూర్తయింది. పలు కేడర్లలో 19 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ మేరకు జేడీఏ కార్యాలయంలోని నోటీసు బోర్డులో జాబితాను ప్రదర్శించారు. ఉమ్మడి అనంత జిల్లాలో 25 మంది ఏడీఏలు పనిచేస్తుండగా... ఐదుగురికి ఐదేళ్లు పూర్తయ్యాయి. ఇందులో తాడిపత్రి, మడకశిర, ధర్మవరం, పెనుకొండ, కదిరి ఏడీఏ పోస్టులున్నాయి. 116 మంది పనిచేస్తుండగా.. 31 మంది ఏఓలకు ఐదేళ్ల సర్వీస్ కాలం పూర్తయింది. మరో 9 ఏఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గ్రేడ్ 1 ఏఈఓ పోస్టులు 24, గ్రేడ్-2 పోస్టులు 115 ఉండగా.. ఇందులో 55 మందికి ఐదేళ్ల సర్వీసు పూర్తయింది. 2 ఏఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 27 మంది సీనియర్ అసిస్టెంట్లు ఉండగా.. ఐదుగురి సర్వీస్ ఐదేళ్లు పూర్తయింది. మరో 2 సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 38 మంది జూనియర్ అసిస్టెంట్లు ఉండగా.. ఏడుగురు జూనియర్ అసిస్టెంట్ల సర్వీస్ ఐదేళ్లు పూర్తయింది. ఒక జూనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. 15 మంది టైపిస్టులు పనిచేస్తుండగా.. ఒకరి సర్వీస్ ఐదేళ్లు పూర్తయింది. మరో 7 టైపిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఐదేళ్లు పూర్తయిన అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా బదిలీ కోసం ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఐదేళ్లలోపు వారికి బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు.

ఎట్టకేలకు ఆప్షన్

వ్యవసాయ శాఖకు సంబంధించి ఎట్టకేలకు ఆన్‌లైన్‌లో అధికారులు, సిబ్బంది బదిలీల కోసం ఆప్షన్లు ఇచ్చుకునే వెసులుబాటు కల్పించారు. మంగళవారం ఉదయమే ఆన్‌లైన్ ఆప్షన్ అవకాశం ఇస్తారని అందరూ ఎదురుచూశారు. మంగళవారం సాయంత్రం ఆన్‌లైన్‌లో బదిలీల కోసం ఆప్షన్ ఇచ్చేందుకు అవకాశం కల్పించారు. ఇదివరకు టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్లు, ఏఈఓలకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించాలని భావించారు. ఆన్‌లైన్ ఆప్షన్ ఇవ్వడంలో ఆలస్యం కావడంతో ఈనెల 22గానీ, 23గానీ ఉమ్మడి జిల్లాకు చెందిన సదరు సిబ్బందికి అనంతపురం జేడీఏ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్లు, ఏఈఓలకు జేడీఏ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించి, బదిలీలు ఖరారు చేయనున్నారు. అలాగే ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సీనియర్ అసిస్టెంట్లు, ఏఓలు, ఏడీఏలు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఇచ్చేందుకు గడువు విధించారు. ఈనెల 26న జోన్-4 పరిధిలోని అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు ఉమ్మడి జిల్లాలకు సంబంధించి సీనియర్ అసిస్టెంట్లు, ఏఓలు, ఏడీఏల జాబితా పరిశీలన అనంతపురం జేడీఏ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఆయా జిల్లాల జేడీఏలు, అధికారులు హాజరుకానున్నారు. పరిశీలన అనంతరం జాబితాను వ్యవసాయశాఖ కమిషనరేట్‌కు పంపనున్నారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, మే20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు జడ్పీలోని సమావేశ మందిరంలో మీటింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు జడ్పీటీసీలు, ఎంపీపీలు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఎంపీలు, ఇతర కార్పొరేషన్ చైర్మన్లు, ఉమ్మడి జిల్లాకి చెందిన అన్నిశాఖల అధికారులకు జడ్పీ వర్గాలు సమాచారం ఇచ్చాయి.

ధర్మకర్తల మండలి కోసం దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్, మే 20(ఆంధ్రజ్యోతి): తాడిపత్రిలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి, గంగాదేవిపల్లిలోని గంగాభవాని, రాప్తాడులోని పండమేటి వెంకటరమణస్వామి దేవాలయాలకు సంబంధించి ధర్మకర్తల మండళ్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ రామాంజనేయులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు దరఖాస్తులను జూన్ 2వ తేదీలోపు జిల్లా కేంద్రంలోని హెచ్చెల్సీ కాలనీలో గల దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

పెనుకొండ రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కియ ఏఎస్ఐ వెంకటరమణ మంగళవారం తెలిపారు. డిగ్రీ చదువుతున్న యువతి ఈనెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మహా ప్రాధాన్యం

మహానాడు నిర్వహణలో ఉమ్మడి జిల్లా నేతలకు బాధ్యతలు

అన్ని కమిటీల్లోనూ చోటు

సభా నిర్వహణ కమిటీలో ముగ్గురికి కీలక పాత్ర



పయ్యావుల కేశవ్



సవిత



కాలవ శ్రీనివాసులు



ప్రభాకర్ చౌదరి



బీకే పార్థసారథి



ఎంఎస్ రాజు



బండారు శ్రావణిశ్రీ



పూల నాగరాజు



బీవీ వెంకటరాముడు

అనంతపురం, మే 20(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు వేడుకల నిర్వహణ కమిటీలో ఉమ్మడి అనంత జిల్లా నాయకులకు ప్రాధాన్యం లభించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మహానాడు నిర్వహణ కమిటీల జాబితాను మంగళవారం విడుదల చేశారు. కడప జిల్లాలో ఈనెల 27, 28, 29వతేదీల్లో మహానాడు వేడుకలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడు మహానాడు వేడుకల విజయవంతానికి సంబంధించి పలు కమిటీలను నియమించారు. మహానాడు నిర్వహణలో అత్యంత కీలకమైన సభా నిర్వహణ కమిటీలో ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు ప్రజాప్రతినిధులకు చోటు కల్పించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజులు సభ్యులుగా ఉన్నారు. సమన్వయ కమిటీ సభ్యులుగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు జిల్లా నుంచి ప్రాధాన్యం ఇచ్చారు. ముఖ్యంగా మహానాడు నిర్వహణలో ప్రధాన కీలక కమిటీ అయిన ఆర్థిక వనరుల కమిటీకి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు కో కన్వీనర్ బాధ్యత అప్పగించారు. తీర్మానాల కమిటీలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు చోటు కల్పించారు. వసతి కమిటీలో సభ్యులుగా మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరిని నియమించారు. భోజనాల కమిటీ సభ్యులుగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథిలను నియమించారు. మీడియా కమిటీలో ఆ పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బీవీ వెంకటరాముడును సభ్యుడిగా నియమించారు.



ప్రకాష్‌నాయుడు

రవాణా కమిటీ సభ్యులుగా ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజుకు బాధ్యతలు ఇచ్చారు. ప్రతినిధుల నమోదు కమిటీలో సభ్యులుగా శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి అవకాశం ఇచ్చారు. వలంటీర్ కమిటీ సభ్యులుగా రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రకాష్ నాయుడుని నియమించారు.

4.0తో పెట్టుబడుల ప్రవాహం

- ప్రభుత్వంపై కుదిరిన నమ్మకం
- జిల్లా వైపు పారిశ్రామిక వేత్తల చూపు
- రూ.11,920 కోట్లతో ఎనర్జీ ప్రాజెక్టులు
- 4,130 మందికి ఉద్యోగావకాశాలు

పుట్టపర్తి/అనంతపురం, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం కుదరడంతో ఉమ్మడి జిల్లా వైపు పెట్టుబడుల ప్రవాహం మొదలైంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి 4.0 పాలసీని తెచ్చింది. పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి, పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఉన్న నేపథ్యంలో పారిశ్రామికవేత్తలంతా ఇటువైపే చూస్తున్నారు. ఇప్పటికే మడకశిర నియోజకవర్గంలో మందుగుండు సామగ్రి తయారీ పరిశ్రమతోపాటు కల్లుమర్రి గ్రామాల పరిధిలో 15 వేల ఎకరాల్లో రూ. 7500 కోట్లతో సోలార్ పార్క్ ఏర్పాటుకు సోలార్ పరిశ్రమలు ముందుకువచ్చాయి. బస్సుల బాడీ బిల్డింగ్ తయారీ యూనిట్‌ను గుడిపల్లిలో 70.7 ఎకరాల్లో నెలకొల్పనున్నారు. రూ.1046 కోట్ల పెట్టుబడితో 2381 మందికి ఉపాధి కల్పించేలా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. చిలమత్తూరు మండలం టేకులోడులో 1105 ఎకరాల్లో భారీ ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వం పారిశ్రామిక పెట్టుబడుల ద్వారా జిల్లాలో ఉపాధి కల్పన లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈల పార్కు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ఐదు పారిశ్రామిక హబ్‌ల ఏర్పాటుకు 35వేల ఎకరాల భూసేకరణకు వేగం పెంచారు. తాజాగా జిల్లాలో రూ. 11920 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి రెండు ఎనర్జీ ఉత్పత్తి సంస్థలు ముందుకు వచ్చాయి. వీటి ద్వారా 4130 మందికి ఉపాధి అవకాశం లభిస్తుంది. ఈ ప్రాజెక్టులకు మంత్రి మండలి ఆమోదం తెలిపారు. ఈనేపథ్యంలో జిల్లాకు ఎనర్జీ ఉత్పత్తి ప్రాజెక్టులు క్యూ కడుతున్నాయి.

కేబినెట్ మీటింగ్‌లో పలు ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో మంగళవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో జిల్లాలో పలు పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడుల ప్రతిపాదనలకు సంబంధించి సిఫారసులకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఉమ్మడి జిల్లాలో బొండాడ ఇంజనీరింగ్ సంస్థ 2000 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు పెట్టుకున్న అభ్యర్థనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ.9000 కోట్ల పెట్టుబడితో స్థాపించనున్న ఈప్రాజెక్టు ద్వారా 3900 మందికి ఉద్యోగ అవకాశలు లభించనున్నాయి. ఈ సంస్థ ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులను నెలకొల్పనుంది. మడకశిర మండలం రాళ్ల అనంతపురం, కురబరహళ్లి ప్రాంతాల్లో ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్‌కు చెందిన 300.30 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టును దేశ్‌రాజ్ సోలార్ ఎనర్జీ సంస్థకు బదిలీ చేయడానికి మంత్రి మండలి ఆమోదం తెల్పింది. ఈప్రాజెక్టు ద్వారా రూ.2920 కోట్ల పెట్టుబడితో 230 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది. తాడిమర్రి మండలం పెద్దకోట్లలో అదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థకు 500 మెగావాట్ పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్ ప్రాజెక్టుకు 12.87 ఎకరాల భూమికి ఎకరాకి రూ. 5లక్షల చెప్పున కేటాయించేందుకు ఆమోదం తెలిపారు.

నేటి నుంచే టీచర్ల బదిలీలు

సంఘాల రాష్ట్ర నేతలతో కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ చర్చలు

బదిలీలపై వెబెక్స్ ద్వారా డీఈఓకి ఆదేశాలు

11 మండలాల నుంచి కంప్యూటర్లు సిద్ధం

నేడు హెచ్‌ఎంల బదిలీలకు ఆన్‌లైన్ దరఖాస్తులు

ఉమ్మడి జిల్లాలో 178 హెచ్ఎం ఖాళీలు



రాష్ట్ర అధికారుల వెబెక్స్‌కు హాజరైన అనంతపురం డీఈఓ ప్రసాద్‌బాబు, ఇతర అధికారులు

కేటగిరీ	వర్కింగ్ టీచర్లు
హెచ్‌ఎంలు	375
ప్రైమరీ హెచ్‌ఎంలు	329
ఎస్‌జీటీలు	7230
స్కూల్ అసిస్టెంట్లు	6850
మొత్తం	14,748

అనంతపురం విద్య, మే 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలకు విద్యాశాఖ పచ్చజెండా ఊపింది. బుధవారం నుంచి బదిలీల ప్రక్రియ మొదలుకానుంది. విద్యాశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీలతో మంగళవారం జరిగిన చర్చల్లో ఉపాధ్యాయ సంఘాల నేతలు చేసిన పలు డిమాండ్లకు అంగీకారం లభించింది. వెంటనే అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులతో వెబెక్స్ నిర్వహించి బదిలీలు ప్రారంభించాలని ఆదేశాలిచ్చారు. అనంతపురం జిల్లా నుంచి డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీ క్రిష్ణయ్య ఇతర జిల్లా విద్యాశాఖాధికారులు వెబెక్స్‌కు అటెండ్ అయ్యారు. బుధవారం నుంచీ బదిలీలు ప్రారంభంకానుండటంతో అధికారులు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. అనంతపురం నగరానికి సమీపంలో ఉన్న సుమారు 11 మండలాల నుంచి అదనంగా కంప్యూటర్లు, లాప్‌ట్యాప్‌లు తెప్పించడంతోపాటు, శారదాస్కూల్‌లో కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు.

2017 తర్వాత మళ్లీ ఆఫ్‌లైన్....?

ఉపాధ్యాయ బదిలీలపై జరిగిన చర్చల్లో సంఘాల నేతలు ఎస్‌జీటీలకు ఆన్‌లైన్ కాకుండా ఆఫ్‌లైన్‌లో బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇందుకు రాష్ట్ర అధికారులు ఆమోదం తెలిపినట్లు స్పష్టమవుతోంది. అయితే అధికారికంగా ఉత్తర్వులు రాలేదు. అయితే హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకు ఆన్‌లైన్‌లో, ఎస్‌జీటీలకు ఆఫ్‌లైన్‌లో బదిలీల అంశంపై సంఘాల నేతల నుంచి భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. 2017లో ఆఫ్‌లైన్ బదిలీలు నిర్వహించారు. 2017 తర్వాత ఆన్‌లైన్‌లోనే నిర్వహించారు. ఇప్పుడు ఎస్‌జీటీలకు ఆఫ్‌లైన్ బదిలీలు అనగానే.. అనేక అక్రమాలు, పైరవీలకు తావు లేకపోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు సంఘాల నేతలు బదిలీల్లో పావులు కదపడానికే ఆన్‌లైన్‌కు కాకుండా ఆఫ్‌లైన్‌కు మొగ్గు చూపారన్న ఆరోపణలు వస్తున్నాయి. పారదర్శకత ఉండదని, ఆలస్యం అవుతుందని ఈ విధానాన్ని కొందరు ఉపాధ్యాయ సంఘాల నేతలతోపాటు, జిల్లా విద్యాశాఖాధికారులు కూడా వ్యతిరేకిస్తున్నారు. వేలాది మంది ఎస్‌జీటీలకు ఆఫ్‌లైన్ బదిలీల నిర్వహణ అంటే తలపోటేనంటూ అధికారులు, సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచే హెచ్‌ఎంల బదిలీలు

తొలుత ప్రధానోపాధ్యాయుల బదిలీలు నిర్వహించనున్నారు. బుధవారం నుంచి హెచ్‌ఎంల బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 178 ప్రధానోపాధ్యాయుల ఖాళీలున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 375 మంది హెచ్‌ఎంలు ఉన్నారు. వీళ్లలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. ఈ ఏడాది మే 31న ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకునే వారు తప్పనిసరిగా బదిలీలకు అప్లై చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పనిచేస్తున్న ప్లేస్‌లో రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయులు రిక్వెస్ట్ కింద బదిలీకి అప్లై చేసుకోవచ్చు. విద్యాశాఖ ఆధ్వర్యంలో శారదాస్కూల్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా తప్పనిసరి బదిలీ అయ్యే హెచ్‌ఎం ద్వారా అధికారులే అప్లై చేయించేలా ఏర్పాట్లు చేశారు.

ఐదేళ్లు పూర్తయ్యే హెచ్‌ఎంలు తప్పనిసరి: ప్రసాద్‌బాబు, డీఈఓ

ఉపాధ్యాయ బదిలీలు ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచి హెచ్‌ఎంల బదిలీలు ఉంటాయి. ఈ నెలాఖరుకు ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకునే హెచ్‌ఎంలు తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలి. రెండేళ్ల సర్వీసు పూర్తయిన హెచ్‌ఎంలు సైతం రిక్వెస్ట్ దరఖాస్తు చేసుకోడానికి సిద్ధంగా ఉండాలి.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



సంజీవ్ కరుణ మృతదేహం

గుత్తి రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడు గ్రామానికి చెందిన రైతు సంజీవ్‌కరుణ (29) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు... సంజీవ్‌కరుణ తనకున్న ఆరెకరాల పొలంలో కొన్నేళ్ల నుంచి వేరుశనగ, ఆముదం, పత్తి పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయాడు. దీంతో పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చలేకపోయాడు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతుండటంతో పంటసాగుకు పెట్టుబడి లేక తీవ్రంగా మనస్తాపం చెందాడు. ఈక్రమంలోనే మంగళవారం తెల్లవారుజామున ఇంటిలో ఉరి వేసుకున్నాడు. ఉదయం కుటుంబసభ్యులు గమనించి అతడిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడికి మొత్తం రూ.8 లక్షల అప్పులు ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ సంఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేప్పట్టారు.

మినీ మహానాడులో విషం తాగిన ఎస్సీ సెల్ నాయకుడు

కష్టపడినా న్యాయం జరగలేదని ఆవేదన



మినీ మహానాడులో పురుగుల మందు తాగుతున్న వెంకటేష్



వెంకటేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా

అనంతపురం మే 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ అర్బన్ నియోజకవర్గ మినీ మహానాడులో మంగళవారం కలకలం రేగింది. పార్టీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు వెంకటేష్ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించారు. అక్కడున్నవారు వెంటనే ఆయనను ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకుని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నా, మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే బెంగళూరుకు తరలించారు. నగరంలోని కమ్మభవన్‌లో అర్బన్ నియోజకవర్గ మినీ మహానాడును ఎమ్మెల్యే దగ్గుపాటి అధ్యక్షతన మంగళవారం ప్రారంభించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడిన తర్వాత ఎమ్మెల్యే మాట్లాడేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే సమావేశంలో కూర్చున్న ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు వెంకటేష్ ఒక్క సారిగా వేదిక వద్దకు వచ్చి వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగి అక్కడే కింద పడిపోయాడు. ఈ హఠాత్ పరిణామంతో ఒక్కసారిగా సమావేశంలో గందరగోళం చోటు చేసుకుంది. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న తనకు ప్రాధాన్యం ఇవ్వలేదన్న ఆవేదనతో వెంకటేష్ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు అతని సన్నిహితులు చెబుతున్నారు. ఆస్పత్రిలో వెంకటేష్‌ను ఎమ్మెల్యే, ఎంపీ పరామర్శించారు. అక్కడే ఉన్న వెంకటేష్ భార్యను ఎమ్మెల్యే ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆందోళన చెందవద్దని, వైద్య ఖర్చులు పూర్తిగా తానేభరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత వెంకటేష్‌తో అన్ని విషయాలపై మాట్లాడి, న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



లక్ష్మీదేవి మృతదేహం

పామిడి, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టకిందపల్లి సమీపాన మంగళవారం రోడ్డు ప్రమాదంలో లక్ష్మీదేవి (25) మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వజ్రకరూరుకు చెందిన లక్ష్మీదేవి తమ్ముడు వీరాతో కలిసి ద్విచక్రవాహనంలో పామిడికి బయల్దేరింది. కట్టకిందపల్లి సమీపాన ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో లక్ష్మీదేవికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఆమెను హుటాహుటిన వజ్రకరూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గుంతకల్లు ఆస్పత్రికి తీసుకెళ్లారు. గుంతకల్లులో చికిత్స పొందుతూ మృతిచెందింది. లక్ష్మీదేవికి భర్త లక్ష్మీనారాయణ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

మోదీ మార్ఫింగ్ ఫొటో, వీడియోల షేరింగ్

ఒకరి అరెస్టు

గార్లదిన్నె, మే 20(ఆంధ్రజ్యోతి): మార్ఫింగ్ చేసిన ప్రధాని నరేంద్రమోదీ ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పంపిన వ్యక్తిని గార్లదిన్నె పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కల్లూరుకు చెందిన మహబూబ్‌బాషా.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేసినట్లు బీజేపీ నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ మహ్మమద్ గౌస్‌బాషా మంగళవారం నిందితుడిని తరిమెల క్రాస్ వద్ద అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలను పంపి, వారి వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

ముగిసిన ఈఏపీసెట్ ఫార్మసీ స్ట్రీమింగ్

నేటి నుంచి ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ పరీక్షలు

అనంతపురం సెంట్రల్, మే 20(ఆంధ్రజ్యోతి): ఈఏపీసెట్‌లో భాగంగా ఫార్మసీ స్ట్రీమింగ్ పరీక్షలు ముగిశాయి. రెండోరోజు మంగళవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3,044 మంది విద్యార్థులకుగాను 2,827 మంది రాశారు. బుధవారం నుంచి ఈనెల 27వ తేదీ వరకు ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వర్షం పడింది. అనంతపురం, బెళుగుప్ప, కూడేరు, ఉరవకొండ, రాప్తాడు, డి హిరేహాళ్ తదితర మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. యాడికి, పుట్లూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

న్యూస్ బాక్స్

హనుమజ్జయంతి ఉత్సవాలకు శ్రీకారం



హనుమద్ వ్రతం నిర్వహిస్తున్న వేదపండితులు

అనంతపురం కల్చరల్, మే 20(ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతిని పురస్కరించుకుని హౌసింగ్ బోర్డులోని భక్తాంజనేయస్వామి దేవాలయంలో ఉత్సవాలకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిగ్రహానికి విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ హనుమద్వ్రతాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో భక్తులు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

కుట్టు శిక్షణకు సౌకర్యాలు కల్పిస్తాం: ఎంపీడీఓ

శింగనమల, మే 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మహిళల కుట్టు శిక్షణ కేంద్రంలో కనీసం సౌకర్యాలు కల్పించి, శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ఈ నెల 4వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'కనీస సౌకర్యాలు లేని కుట్టు శిక్షణ' అనే కథనం వెలువడిన విషయం విదితమే. దీనిపై స్పందించిన ఎంపీడీఓ మంగళవారం కుట్టు శిక్షణా కేంద్రానికి రెండు ఫ్యాన్లు అందజేయడంతో పాటు తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ... శిక్షణ తరగతులలో మహిళలు ఉక్కపోతతో పాటు సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవమన్నారు. అందుకని శిక్షణ కేంద్రానికి మరో రెండు ఫ్యాన్లు అందజేశామని, అలాగే తాగునీరు ఏర్పాటు చేశామన్నారు. అలాగే అలాగే పక్కన ఉన్న ప్రభుత్వ కార్యాలయంలో బాత్రూమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, నాయకులు కాయల రమణయ్య, ఫక్రుద్దీన్, వీరా, శంకర, భారతి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

భారత ఆర్మీకి రూ.1,01,116 విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న తిరువీధుల జగదీష్‌కుమార్ తదితరులు

అనంతపురం కల్చరల్, మే 20(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన హరిశ్చంద్ర ఘాట్ ఆధ్వర్యంలో సిందూర్ ఆపరేషన్ కోసం భారత ఆర్మీకి రూ. 1,01,116 విరాళం అందజేశారు. హరిశ్చంద్ర ఘాట్ అధ్యక్షుడు తిరువీధుల జగదీష్‌కుమార్‌తో పాటు పాతూరు ఆర్యవైశ్య సంఘం నాయకులు మంగళవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఆయన చాంబర్‌లో కలిసి చెక్కును అందజేశారు. హరిశ్చంద్రఘాట్ కోశాధికారి ధూపకుంట్ల సాయినాథ్ గుప్త, పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, పాతూరు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాల యం ధర్మకర్త గర్లాల నాగరాజు, జైన్ సంఘం సభ్యుడు హర్షద్ జైన్ పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుల ఎంపిక

అనంతపురం రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరిధిలోని టీడీపీ అక్కంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బి. శ్రీనివాసులు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో మంగళవారం గ్రామ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో గ్రామ కమిటీ అధ్యక్షుడి ఎంపిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, తెలుగు రైతు రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షుడు నారాయణస్వామి, మాజీ ఎంపిటీసీ ఇమాముల్ సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, అంజన్‌రెడ్డి, మస్తాన్, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

● రామగిరి: మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల నాయకులు, రామగిరి పంచాయతీ కార్యకర్తలు మంగళవారం సమావేశమై గ్రామ కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా కె.విశ్వనాథ్, ఉపాధ్యక్షుడిగా హెచ్ శేఖర్‌ను ఎన్నుకున్నారు. బూత్ కన్వీనర్లుగా నాగరాజు, గంగిరెడ్డి, దుర్గప్పను ఎంపికచేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ఆదేశాలతో పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు.

24న గుండె ఉచిత వైద్యశిబిరం

రామగిరి, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలంపల్లిలో ఈ నెల 24న ఉచిత వైద్యగుండె వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు అనంతపురంలోని మార్క్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వారు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె కుమారులు పరిటాలశ్రీరామ్, పరిటాల సిద్ధార్థ సహకారంతో స్థానిక ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామని వారు తెలిపారు. సమస్యలు ఉన్న వారు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'రైతు రుణాలను మాఫీ చేయాలి'

శింగనమల, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కూలీలు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను వెంటనే మాఫీ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి. చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కల్లుమడి గ్రామంలో సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు రైతులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నేసే మధు, చికెన్ బాషా, రామసుబ్బారెడ్డి, నారప్ప తదితరులు పాల్గొన్నారు.

టెట్రా మద్యం బాక్సుల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న టెట్రా మద్యం పాకెట్లతో ఎక్సైజ్ అధికారులు

అనంతపురం అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): అందిన సమాచారం మేరకు అనంతపురం ఎక్సైజ్ పోలీసులు నగరంలోని రాజీవ్ కాలనీలో మంగళవారం ఆకస్మిక దాడులు చేశారు. హాజీవ్ అనే వ్యక్తి నుంచి నాలుగు టెట్రా మద్యం బాక్సులు (384 టెట్రా పాకెట్లు) స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐలు జయనరసింహ, జాకీర్‌హుస్సేన్, కృష్ణారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

చెన్నేకొత్తపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం విద్యుదాఘాతానికి గురై ఓ గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన ఓబుగారి సుబ్బిరెడ్డి పాడిపోషణతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రెండు గేదెలను ఇంటి సమీపంలో మేతకు వదిలాడు. అయితే అక్కడ ప్రధాన రోడ్డు పక్కన విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన స్టే వైరుకు విద్యుత్ సరఫరా అయింది. మేతమేస్తున్న గేదె దానికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఆ గేదె రూ.80వేలు విలువ చేస్తుందని బాధిత రైతు తెలిపారు. పాడితోనే కుటుంబాన్ని పోషిస్తున్నానని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

హంద్రీనీవా కాలువలోకి భారీగా వర్షపు నీరు

● రాగులపాడు పంప్‌హౌస్ నుంచి పీఏబీఆర్‌లోకి మళ్లింపు

అనంతపురం క్లాక్‌టవర్, మే 20(ఆంధ్రజ్యోతి): ఎన్నడూ లేని విధంగా హంద్రీనీవా కాలవలోకి భారీగా వర్షం నీరు చేరింది. హంద్రీనీవా కాలవలో ఓ వైపు విస్తరణ, మరోవైపు లైనింగ్ పనులు జరుగుతున్న క్రమంలో వర్షంనీరు చేరడం పనులకు ఆటంకంగా మారింది. 25 కిలోమీటర్ల మేర భారీగా చేరిన వర్షపు నీటిని రాగులపాడు పంపుహౌస్ నుంచి పీఏబీఆర్‌కు వదిలినట్లు హంద్రీనీవా ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్ తెలిపారు. హంద్రీనీవా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అన్‌సీజన్‌లో పంపుహౌస్ ఆన్ చేసి నీటిని దిగువకు వదలడం ఇది మొదటిసారి అని ఆయన పేర్కొన్నారు. రెండు మూడు రోజుల పాటు రాగులపాడు పంపుహౌస్ నుంచి వాగుల ద్వారా పీఏబీఆర్‌కు మళ్లిస్తామని తెలిపారు. నీటి ఉధృతి తగ్గిన వెంటనే హంద్రీనీవా కాలవ వెడల్పు, లైనింగ్ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.



రాగులపాడు పంప్‌హౌస్ నుంచి దిగువకు వెళ్తున్న నీరు

మంత్రి లోకేశ్ జోక్యంతోనే పీటీసీ సమస్య పరిష్కారం

● క్రీడాకారులు, వాకర్స్‌కు ఉచితంగానే అనుమతి: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం క్లాక్‌టవర్, మే 20(ఆంధ్రజ్యోతి): ఓ పోలీస్ అధికారి అత్యుత్సాహం వల్ల ఆర్నెల్లుగా నెలకొన్న నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియం సమస్యను మంత్రి నారా లోకేశ్ జోక్యంతోనే పరిష్కారమైందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియానికి మంగళవారం వచ్చిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు క్రీడాకారులు, వాకర్స్ సమస్యను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలీస్ సెలెక్షన్స్‌లో భాగంగా క్రీడాకారులకు సంబంధించిన సామగ్రిని తొలగించారన్నారు. ఆ తరువాత వాటిని పునరుద్ధరించకుండా పీటీసీ డీఎస్పీ అడ్డుకోవడంతో సమస్య జటిలమైంద న్నారు. ఇదే విషయాన్ని శాప్ చైర్మన్ రవినాయుడు ప్రత్యేక చొరవతో జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు వివరించారని అన్నారు. మంత్రి వెంటనే స్పందించి నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియం సమస్యను పరిష్కరించారని తెలిపారు. దీంతో హోంమంత్రి, సీఎస్, డీజీపీ జోక్యం చేసుకుని... మునుపటిలాగే క్రీడాకారులు, వాకర్స్‌ను ఉచితంగా పీటీసీ స్టేడియంలోకి అనుమతించాలని కలెక్టర్, ఎస్పీకి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. మంత్రి నారా లోకేశ్, శాప్ చైర్మన్ రవినాయుడుకు క్రీడాకారులు, వాకర్స్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. శాప్ ద్వారా స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వాకర్స్, క్రీడాకారులు ఎమ్మెల్యేని సన్మానించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మోహన్ కుమార్, మైనార్టీ విభాగం ఫిరోజ్‌అహ్మద్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీరాములు, రాజు, క్రిష్టప్ప, దివాకర్ నాయుడు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మినీ మహానాడును విజయవంతం చేయండి

● ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు

గార్లదిన్నె, మే 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బుధవారం నిర్వహించనున్న మినీ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. టీడీపీ ప్రతిష్టాత్మకంగా మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. బుధవారం గార్లదిన్నెలోని మర్తాడు క్రాస్ వద్ద టీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

ఏర్పాట్లు ముమ్మరం: గార్లదిన్నెలోని మర్తాడు క్రాస్ వద్ద టీ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించనున్న మినీ మహానాడు కార్యక్రమంకు అవసరమైన ఏర్పాట్లను స్థానిక నాయకులు ముమ్మరం చేశారు.

● శింగనమల: గార్లదిన్నెలో బుధవారం నిర్వహించే మినీ మహనాడును టీడీపీ కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ గుత్తా ఆదినాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మండలం నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనే సీడాప్ ధ్యేయం

● డీఆర్‌డీఏ పీడీ శైలజ

అనంతపురం క్లాక్‌టవర్, మే 20(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకుల్లో నైపుణ్యతను పెంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే సీడాప్ లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ శైలజ పేర్కొన్నారు. స్థానిక గుత్తిరోడ్డులోని సీడాప్ లక్ష్మీదీప ట్రైనింగ్ సెంటర్‌లో ఉద్యోగాల కల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ శైలజ మాట్లాడుతూ... ప్రతి ఉద్యోగి ప్రతి రోజు కనీసం ఐదుగురు నిరుద్యోగ యువతీ, యువకులను సీడాప్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించి, సీడాప్ ద్వారా నిర్వహిస్తున్న శిక్షణ, జాబ్‌మేళాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీడాప్ జేడీఎం సూర్యనారాయణ, రామాంజి నేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

అనంతపురం క్రైం, మే 20(ఆంధ్రజ్యోతి): నగరంలో గత నెలాఖరులో జరిగిన దాడిలో గాయాలకు గురైన ఓ వ్యక్తి మృతి చెందాడు. నగరంలోని విద్యారణ్యనగర్‌లో షాజహాన్ అనే వ్యక్తి శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని ముద్దిరెడ్డిపల్లికి చెందిన ఓ మహిళతో సహజీవనం చేసేవాడు. ఏప్రిల్ 30న రాత్రి షాజహాన్ మద్యం తాగి వచ్చి, ఆమెతో గొడవకు దిగాడు. దీంతో ఆమె రోకలితో షాజహాన్ తలపై బాదగా షాజహాన్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ నెల 3న ఆమెను నాలుగో పట్టణ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. షాజహాన్‌ను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం సమీపంలోని చెన్నకేశవపురంలో సోదరుడు ఇంట్లో ఉండి చికిత్స పొందేవాడు. అతడు మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఐవీఆర్ఎస్ సర్వే ఉంది.. జాగ్రత్త : డీఎంఈ

అనంతపురం టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆస్పత్రులు, డాక్టర్ల పనితీరుపై నిత్యం ఐవీఆర్ఎస్ సర్వే చేయిస్తున్నారనీ, జాగ్రత్తగా విధులు నిర్వహించాలని డాక్టర్లకు వైద్యవిద్య సంచాలకుడు (డీఎంఈ) నరసింహం హెచ్చరించారు. అదనపు డీఎంఈ వెంకటేశ్వర్లతో కలిసి డీఎంఈ మంగళవారం అనంతకు వచ్చారు. తొలుత సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని, అందులోని రికార్డులను పరిశీలించారు. ఒకట్రెండు విభాగాలు మినహా అన్నిచోట్లా డాక్టర్లున్నా రోగులకు అవసరం మేరకు వైద్యసేవలు అందించకపోవడంపై డీఎంఈ అసంతృప్తి వ్యక్తం చేశారు. సూపర్ స్పెషాలిటీలో క్యాజువాలిటీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. నెలాఖరులోగా ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అక్కడి నుంచి వైద్య కళాశాలకు చేరుకుని, అధికారులు, విభాగాధిపతులు, ప్రొఫెసర్లతో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. 1200 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి, ఆర్ఎంఓలు,హెచ్ఓడీలు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే



వ్యవసాయ క్షేత్రంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి/రామగిరి, మే 20(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, ప్రభుత్వ కార్యక్రమాల్లో సోమవారం వరకు బిజీగా ఉన్న ఎమ్మెల్యే పరిటాల సునీత మంగళవారం వ్యవసాయ క్షేత్రంలో గడిపారు .కనగానపల్లి మండలం నర్సింపల్లి, రామగిరి మండలం వెంకటాపురంలోని తమ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి అక్కడ పంట పొలాలను పరిశీలించారు. సాగుచేసిన కొబ్బరి, అల్లనేరేడు, చీనీపంటలను టీడీపీ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. వర్షాలు వస్తున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కూలీలకు సూచించారు. అలాగే పంట దిగుబడులపై ఆరాతీశారు, అనంతరం ఆమె మాట్లాడుతూ... సోమవారం వరకు నసనకోట దుర్గాంబ జాతర ఉత్సవాల్లోను, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నామన్నారు. రాజకీయాల్లో ఎంతబిజీగా ఉన్నప్పటికీ అప్పుడప్పుడు తమ వ్యవసాయ క్షేత్రాలకు వస్తుంటామన్నారు.

రైతులకు సబ్సిడీ విత్తనాలివ్వాలి

● కలెక్టర్‌ను కోరిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

అనంతపురం సెంట్రల్, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులకు సరైన సమయంలో సబ్సిడీ విత్తనాలు పంపిణీచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్‌ను కలిసి వివిధ అంశాలపై వినతి పత్రాన్ని అందజేశారు. పలు గ్రామాల్లో నీటి సమస్య నెలకొందని, ఆలయాల భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ఇలా పలుసమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని మోదీ చిత్రపటాన్ని ఏర్పాటుచేయాలని విన్నవించామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, చంద్రమోహన్ రెడ్డి, ఈశ్వర్‌ప్రసాద్, ఆంజనేయులు, దామోదర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పోరాటాలకు మద్దతు: ఆర్ఈఎఫ్

అనంతపురం క్లాక్‌టవర్, మే 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, పదోన్నతుల సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న పోరాటాలకు తమ మద్దతు ఉంటుందని ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణనాయక్ తెలిపారు. ఉపాధ్యాయులు చేపడుతున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతును మంగళవారం స్థానిక ఉపాధ్యాయభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్ఈఎఫ్ నాయకులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ నాయక్ మాట్లాడుతూ... మంగళవారం ఉపాధ్యాయ సంఘాలతో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సమావేశం ఏర్పాటు చేసి సానుకూలంగా స్పందించినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఈఎఫ్ నాయకులు నాగభూషణం, శ్రీనివాసులు, ఓబుళేసు, మద్రిస్వామి, రాజశేఖర్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'20మంది విద్యార్థులకొక ఉపాధ్యాయుడు ఉండాలి'

అనంతపురం సెంట్రల్, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి 20మంది విద్యార్థులకు ఒక ఎస్‌జీటీని నియమిస్తేనే ప్రాథమిక స్థాయి విద్యాప్రమాణాలు మెరుగుపడుతాయని ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 117, 84, 85 వంటి జీఓలతో పాఠశాల విద్యావ్య వస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. పాదర్శకమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. అందుకు ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు, మేధావి వర్గాలతో సమావేశాన్ని ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సురేష్‌బాబు, శివారెడ్డి, ఉజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరిన మెస్ బిల్లుల స్వాహా వ్యవహారం

● నేరుగా విచారణకు వచ్చిన డీఎంఈ
● పక్కదారిపై ఒక్కొక్కరిని పిలిపించి ఆరా
● క్రిమినల్ కేసుకు ఆదేశం- శాఖాపరమైన చర్యలపై టెన్షన్



డీఎంఈ నరసింహానికి ఫిర్యాదు చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం టౌన్/విద్య, మే 20(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలో మహిళా మెడికోలు చెల్లించిన మెస్ బిల్లుల స్వాహా వ్యవహారం తారాస్థాయి కి వెళ్లింది. మెడికోల మెస్ బిల్లులు రూ. లక్షల్లో పక్కదారి పట్టినట్లు వారం రోజుల క్రితం బయటపడగా, ఆంధ్రజ్యోతిలో ప్రత్యేకకథనం ప్రచరితమైన విషయం విదితమే. ఈ కథనానికి స్పందించిన కలెక్టరుతో పాటు రాష్ట్ర అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. దీనిపై విచారణ చేయించి నివేదికలు ఇవ్వాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావును ఆదేశించారు. ఈ విచారణ విషయంలో వివిధ రకాల ప్రచారాలు సాగడంతో కొందరు తాము విచారణ చేయలేమని తప్పుకున్నారు. మరొకరిని నియమించినా వాస్తవ నివేదికలు ఇవ్వలేకపోయారు. దీనిపై అనేక ఆరోపణలు రావడంతో చివరకు రాష్ట్రశాఖ నుంచి నేరుగా డీఎంఈ నరసింహం రంగంలోకి దిగారు. ఆయన మంగళవారం అడిషనల్ డీఎంఈ వెంకటేశ్వర్లతో కలిసి నగరానికి వచ్చారు. మెడికల్ కళాశాలలోని ప్రత్యేక గదిలో ఉంటూ మెస్‌బిల్లుల విషయానికి సంబంధం ఉన్న ప్రతిఒక్కరిని పిలిపించి రాతపూర్వకంగా వివరణ తీసుకున్నారు. ఆ సమయంలోనూ ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నట్లు విశ్వసనీయసమాచారం. అదేసమయంలోనే ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు డీఎంఈని కలిశారు. డబ్బు స్వాహా చేసినవారిపైన, అందులో పాత్ర ఉన్నవారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎంఈ అందరి అభిప్రాయాలను తీసుకున్న తర్వాత.. దాదాపు రూ.18లక్షలకు పైగా డబ్బు తమ వ్యక్తిఖాతాల్లోకి వేసుకున్న అకౌంటెంట్‌పై క్రిమినల్‌కేసు నమోదుచేయించాలని ప్రిన్సిపాల్‌కు, డాక్టర్లను ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈ మెస్ బిల్లుల వ్యవహారంలో ప్రిన్సిపాల్, డాక్టర్లు ఎందుకు నిర్లక్ష్యం వహించారనే విషయంపై, ఈ విచారణలో డీఎంఈకి క్లారిటీ వచ్చినట్లు సమాచారం. వారిపై ఎలాంటి శాఖాపరమైన చర్యలు ఉంటాయోనని వైద్యవర్గాలలో టెన్షన్ నెలకొంది.

ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలి

● ఆర్టీసీ అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం
● అనంత బస్టాండులో తనిఖీలు



బస్టాండు ఆవరణలో అపరిశుభ్రతపై అధికారులను ప్రశ్నిస్తున్న కలెక్టర్

అనంతపురం కల్చరల్, మే 20(ఆంధ్రజ్యోతి): బస్టాండ్‌లో ఎప్పటికప్పుడు పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం అనంతపురం బస్టాండులో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండు ఆవరణలో ఎక్కడ పడితే అక్కడ చెత్త కనిపించడంతో అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. బస్టాండు ఆవరణలో డస్ట్‌బిన్‌లలో చెత్త వేయకుండా బయటే పడేస్తున్నారని, ఎప్పటికప్పుడు పరిశుభ్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బస్టాండు ఆవరణలో పరిశుభ్రత పాటించని రెండు దుకాణాలకు రూ.25వేలు చొప్పున జరిమానా విధించారు. జరిమానా వసూలయ్యేవరకూ ఆ దుకాణాలను మూసివేయాలన్నారు. ఎప్పటికప్పుడు డ్రైనేజీని శుభ్రం చేయాలని, బస్సులు నిలిపే ప్లాట్‌ఫాంల వద్ద నేమ్‌బోర్డులు స్పష్టంగా కనిపించాలన్నారు. బస్టాండు ఆవరణలోని గుంతలను పూడ్చి సీసీ రోడ్డు వేయాలని ఆదేశించారు. అనంతరం స్వీపర్లతో మాట్లాడారు. ప్రయాణికులతో మాట్లాడి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని, నగరపాలకసంస్థ కమిషనర్ బాలస్వామి, డిప్యూటి సీటీఎం శ్రీలక్ష్మి, డీఎం నాగభూపాల్, బస్టాండు మేనేజర్ కేవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

యోగా కార్యక్రమాల్లో అందరూ పాల్గొనండి: కలెక్టర్

అనంతపురం టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర-2025 కార్యక్రమాల్లో భాగంగా నెలరోజులు పాటు చేపట్టే యోగా కార్యక్రమాల్లో ప్రతిఒక్కరు పాల్గొనాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో మాట్లాడుతూ... బుధవారం నుంచి జూన్21వరకు జిల్లాలో నెలరోజుల పాటు యోగాంధ్ర క్యాంపెయన్ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. అన్ని గ్రామ,వార్డు సచివాలయాల పరిధిలో యోగా ప్రాక్టీస్ జరగాలని ఆదేశించామన్నారు. బుధవారం అనంతపురంలోని ఇండోర్‌స్టేడియంలో శిక్షణ కేంద్రం ప్రారంభించనున్నట్లు తెలిపారు. శిక్షణలో పాల్గొనేవారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. దీనిపై పెద్దఎత్తున ప్రచారంచేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, ఇందుకు అన్నివర్గాలు సహకరించాలని కలెక్టరు కోరారు.

విధుల్లో అలసత్వం తగదు: కమిషనర్



మాట్లాడుతున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం క్రైం, మే 20(ఆంధ్రజ్యోతి): ఇకపై ప్రతి రోజూ వస్తినమ్మా...పోతినమ్మా అంటే కుదరదు...విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని నగర కమిషనర్ బాలస్వామి హెచ్చరించారు. ఆయన మంగళవారం కౌన్సిల్ హాల్‌లో డిప్యూటీ కమిషనర్ పావని, ఎస్ఈ చంద్రశేఖర్‌తో కలిసి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ....ఉద్యోగులు విధుల విషయంలో సమయపాలన పాటించడం లేదన్నారు. అంకిత భావంతో పని చేయాలన్నారు. కొందరు ఉద్యోగులు రెండు, మూడు రోజుల పాటు అనధికారికంగా సెలవు తీసుకుంటున్నారన్నారు. ఇకపై అలాంటివారి ఆటలు సాగవన్నారు. ఓ ఉద్యోగి నెలల తరబడి ఎందుకు సెలవులో ఉన్నారని ప్రశ్నించారు. గ్రీవెన్స్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు.

40 శాతం సబ్సిడీతో విత్తన పంపిణీ

అనంతపురం అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో 40 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. 30 శాతం సబ్సిడీతో పెసర, మినుము, కంది విత్తనాలు, 50 శాతం సబ్సిడీతో చిరుధాన్యాలు పంపిణీ చేయనున్నారు.

డీఈఐసీ నిర్వహణ భేష్

● వైద్యశాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టరు అనిల్

అనంతపురం టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆస్పత్రి ఆవరణంలో ఉన్న డీఈఐసీ సెంటర్ నిర్వహణ చాలాబాగుందని వైద్యశాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టరు డాక్టరు అనిల్‌కుమార్ కొనియాడారు. ఆయన మంగళవారం డీఈఐసీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈఐసీలో చిన్నారులకు అందిస్తున్న వైద్యసేవలు, చికిత్సాగదులు, తదితర వాటిని పరిశీలించి ఆనందం వ్యక్తంచేశారు. ఇలాగే సేవలందించాలని అందుకు వైద్యశాఖ తరపున తమవంతు సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టరు నారాయణస్వామి, డీఐఓ డాక్టరు యుగంధర్, మేనేజరు రజిత, వైద్యులు శ్రీనివాసరెడ్డి, విష్ణుమూర్తి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేసేదాకా పోరాడుతాం

● మాంచోతో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు



మాంచో ఫెర్రర్‌ను కలిసిన దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు

అనంతపురం అర్బన్/క్లాక్ టవర్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్ఏ) రెన్యువల్ చేసేదాకా పోరాడు తా మని ఉమ్మడి అనంత జిల్లా దివ్యాంగుల హ క్కుల పోరాట సమితి నాయకులు పేర్కొన్నారు. ఆ సంఘం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వసంతకుమార్, కార్యదర్శి రాజేష్, నాయకులు చెన్నమలప్ప, న్యాయ సలహాదారుడు జెన్నే ఆనంద్ మంగళవారం స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో ఆ సంస్థ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేసేదాకా సంఘం ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇందుకు ఆయన స్పందిస్తూ.. పది రోజుల క్రితం ఢిల్లీకి వెళ్లి, ప్రభుత్వం పెద్దలతో చర్చించామని తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించడంతో దరఖాస్తు చేసి వచ్చానని, అందరి సహకారంతో త్వరలోనే శుభవార్త వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సుధాకర్, లక్ష్మన్న, పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతలపై అవగాహన

అనంతపురం సెంట్రల్, మే 20(ఆంధ్రజ్యోతి): కొనుగోళ్ల ప్రక్రియలో తూనికలు, కొలతల అంశంపై అవగాహన అవసరమని లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రపంచ మెట్రాలజీ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. జిల్లా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సదస్సుకు అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్, ఇన్‌స్పెక్టర్లు శంకర్, మహ్మద్ గౌస్ హాజరై మాట్లాడారు.

సంక్షిప్త వార్తలు

ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



గుంతకల్లుటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురం గ్రామంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి రాతి దేవాలయంలో మంగళవారం ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌కు విశేష అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తలారి పరుశురాముడు, శకుంతలమ్మ, అర్చకులు రాకేష్, చెన్నకేశవ స్వామి, సభ్యులు నారాయణ, మురళి, మల్లికార్జునస్వామి పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



రాస్తారోకో చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఉరవకొండ, మే 20(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని కౌలు రైతు, వ్యవసాయకార్మిక సంఘం అధ్యక్షులు రంగారెడ్డి, కృష్ణమూర్తి పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం కౌలు రైతు, వ్యవసాయకార్మిక సంఘం నాయకులు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్యాంకు రుణాలకు రైతులతో వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యూవల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బాలరంగయ్య, వెంకటేష్, సుంకన్న, సిద్ధప్ప, రవి, వీరాంజనేయులు పాల్గొన్నారు.

రెండు రేషన్ షాపుల సీజ్

ఉరవకొండ, మే 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 6, 21 చౌకడిపోలను సీజ్ చేసినట్లు తహసీల్దారు మహబూబ్‌బాషా తెలిపారు. దుకాణాలను తహసీల్దార్ తనిఖీ చేశారు. షాపులలో నిత్యవసర సరుకులు స్టాక్ కంటే తక్కువగా ఉండడంతో సీజ్ చేసి డీలర్లపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ రాము పాల్గొన్నారు.

ఎనిమిది ఇసుక ట్రాక్టర్లు..

తాడిపత్రి, మే 20(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, ఎస్‌ఐ ధరణీబాబు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సజ్జలదిన్నె, పట్టణానికి చెందిన ఎనిమిది ట్రాక్టర్లను సీజ్ చేశారు. యజమానులపై కేసులు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

బొమ్మనహాళ్, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురవళ్లి రోడ్డులో సోమవారం అర్ధరాత్రి లారీ బోల్తా పడింది. బొమ్మనహాళ్ సమీపంలోని జిందాల్ సా కర్మాగారానికి వెళుతున్న ఓ భారీ లారీ రోడ్డు గుంతలుగా ఉండడంతో అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. మంగళవారం ఉదయం క్రేన్‌ల సహాయంతో లారీని బయటకు తీశారు.

గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయండి

పుట్లూరు, మే 20(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో వైసీపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి శైలజానాథ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో మంగళవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. గతంలో తనవద్ద ఉన్న నాయకులు కూడా వస్తుంటారని వారిని శత్రువులుగా చూడకూడదన్నారు. సమావేశంలో ఎంపీపీ రాఘవరెడ్డి, సర్పంచులు రామకృష్ణారెడ్డి, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25న తాడిపత్రిలో మినీమహానాడు

తాడిపత్రి, మే 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకృష్ణ దేవరాయ కల్యాణ మండపంలో ఈనెల 25న టీడీపీ మినీమహానాడు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. మినీమహానాడుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జేసీ అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

జూదరుల అరెస్టు

బెళుగుప్ప, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంగవరంలో మంగళవారం తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి పేకాటలాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు. గ్రామశివార్లలో ఉన్న పెట్రోల్‌బంక్ సమీపంలో జూదమాడుతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి జూదరులతో పాటు ఆరు బైకులను, రూ.22,300 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు.

కళ్యాణదుర్గం అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

కళ్యాణదుర్గం, మే 20(ఆంధ్రజ్యోతి): అందరి సమన్వయంతో కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద మినీ మహానాడు నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు, కార్మిక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వెంకటశివుడు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను గెలిచిన వెంటనే నియోజకవర్గంలోని 1500 మందికి పైగా నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇప్పించామని అన్నారు. మెగా జాబ్‌మేళా నిర్వహించి 200 కంపెనీలతో ఇంటర్వ్యూలు నిర్వహించి సుమారు నాలుగు వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ తో చర్చించి ప్రత్యేకంగా కళ్యాణదుర్గం నియోజకవర్గానికి 465 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయించానని వివరించారు. యువతకు క్రీడల్లో ఉత్సాహం నింపేందుకు ఐపీఎల్ తరహాలో మెగా కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించామని తెలిపారు. సొంత నిధులతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. భైరవాన్ తిప్ప ప్రాజెక్టు కాలువ పనులను పూర్తి చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తానని, నియోజకవర్గంలోని 114 చెరువులకు నీరు నింపడమే తన ప్రధాన ధ్యేయమన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ.. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఎమ్మెల్యే సురేంద్రబాబు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మినీ మహానాడుకు హాజరుకావడం చూస్తే ఇక్కడ టీడీపీపై ఏ స్థాయిలో ఆదరాభిమానాలు వున్నాయో తెలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాటలో గ్రామాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే క్రీడాపోటీలు: కాలవ



డి.హీరేహాళ్‌లో క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

డి.హీరేహాళ్/కణేకల్లు/రాయదుర్గం రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లో కూడా ఎంతో మంది ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉంటారని, వారి ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ఐదు మండలాల్లో కేసీఎల్ పేరిట క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం క్రికెట్ టోర్నమెంట్‌ను డి.హీరేహాళ్‌లో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాటింగ్ చేస్తూ క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండేందుకు దోహదపడతాయన్నారు. మండల స్థాయిలో విజయం సాధించిన నాలుగు టీములను నియోజకవర్గ స్థాయిలో ఆడేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి, నాయకులు నాగల్లి రాజు, హనుమంతరెడ్డి, తిప్పేస్వామి, శ్రీరాములు, బసవ, తాయప్ప, వెంకటేశు, వన్నూరుస్వామి, విజయ్ పాల్గొన్నారు. కణేకల్లు క్రాసింగ్‌లో క్రికెట్ టోర్నీని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లోని క్రీడాకారులకు ప్రోత్సాహం లేక కనుమరుగవుతున్నారని, ఈ టోర్నీ ద్వారా వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లాలెప్ప, ఆనంద్ రాజ్, ఆది, సుదర్శన్, బీటీ రమేష్, నవీన్, షేక్‌ముజ్జు, మారుతి పాల్గొన్నారు. రాయదుర్గం మండలం కాశీపురం గ్రామంలో కేసీఆర్ టోర్నమెంట్‌ను కాలవ భరత్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, సిద్ధప్ప, వీరస్వామి, సోమశేఖర్, ఆంజనేయులు, మురళి పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



గుంతకల్లులో ఐఎఫ్‌టీయూ నాయకుల నిరసన, తాడిపత్రిలో ఎద్దులబండ్లతో ర్యాలీ

గుంతకల్లుటౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సురేష్ డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు, నూతన వ్యవసాయ మార్కెట్ చట్టాలను తీసుకు రావడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు రఘునాథ్‌రెడ్డి, రాందాస్, రామాంజనేయులు, సత్తార్, నారాయణ, షేక్షావలి, విశ్వనాథ్, గోపి,బాషా, రామకృష్ణనాయక్, తదితరులు పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సాకే నాగరాజు, జగదీష్, తిమ్మప్ప, ఎస్‌కేం బాషా పాల్గొన్నారు.

● కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలోని స్థానిక తహసీల్దారు కార్యాలయం నుంచి టీ సర్కిల్ వరకు సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీను చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ.. కార్మికుల హక్కులు కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగనాథ్, వన్నూరుస్వామి, నటరాజు, అశోక్, రామచంద్ర, ఈశ్వర్, సోము తదితరులు పాల్గొన్నారు.

● పెద్దవడుగూరు : మండలంలోని కిష్టిపాడు గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడుయాదవ్ మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలుచేయాలని, బోరుబావులకు మీటర్లు బిగించరాదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రంగస్వామి, ఆదినారాయణ, ఓబిరెడ్డి, నారాయణస్వామి పాల్గొన్నారు.

● తాడిపత్రి : మండలంలోని గంగాదేవిపల్లిలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎద్దులబండ్ల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. రైతు పంటలకు మద్దతు ధర ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ రూ.20వేలు పెట్టుబడి సాయం ఇవ్వాలన్నారు. కౌలుచట్టం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉపాధిహామి పథకం నిధులు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజారామిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, శంకర్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



ట్రైసైకిళ్లను ప్రారంభిస్తున్న అధికారులు

ఉరవకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): మేజరు పంచాయతీ పరిధిలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందు కు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న ట్లు డీఎల్‌పీవో విజయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో రవిప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం చెత్త సేకరణ కోసం కొనుగోలు చేసిన 10 ట్రైసైకిళ్లను ప్రారంభించారు. రూ.2.50 లక్షలతో 10 ట్రైసైకిళ్లను కొనుగోలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు లలితమ్మ, కార్యదర్శి గౌస్, వార్డు సభ్యులు వాసుదేవుడు, రవి, రామాంజనేయులు పాల్గొన్నారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సీతారాములు

యల్లనూరు, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి మహా కుంభాభిషేక కార్యక్రమంలో భాగంగా రెండోరోజున హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. గణపతిహోమం, ఆంజనేయస్వామి జపమాల, సీతారామ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు అర్చకులు చందుస్వామి తెలిపారు.

రేషన్ వ్యాన్ల రద్దు హర్షణీయం

విడపనకల్లు, మే 20(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీ వ్యాన్లను రద్దు చేస్తు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మండల డీలర్లు సంఘం అధ్యక్షుడు జయరాం హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ రేషన్ సరఫరా చేస్తున్న వ్యాన్లు ఉండవని ప్రకటించటంతో డీలర్లకు న్యాయం జరిగిందన్నారు. వచ్చే నెల నుంచి లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యాన్ని తీసుకోవాలని తెలిపారు.

ఘనంగా తేనెటీగల దినోత్సవం

బ్రహ్మసముద్రం, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండు వద్ద జనవిజ్ఞాన వేదిక తాలూకా ఉపాధ్యక్షుడు రాజన్న ఆధ్వర్యంలో మంగళవారం తెనెటీగల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు, గ్రామ ప్రజలకు తేనె ఉపయోగాలను వివరించారు. ఐక్యతకు, పరోపకార గుణానికి, కష్టపడే అంకితభావం తేనెటీగకు వుందన్నారు. కృత్రిమ తేనె కన్నా అడవులలో లభించే తేనె చాలా మంచిదన్నారు. పుష్పించే మొక్కలను ఎక్కువగా పెంచాలని, తేనెటీగల కోసం నీటిని ఆరుబయట డ్రాలలో నిల్వ వుంచాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులుకు నివాళి

గుత్తి, మే 20(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్స్ భవనంలో మంగళవారం టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతిని పెన్షనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు స్వాతంత్ర సమరయోధుడు అన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి రాజకీయాల్లో ప్రముఖ వ్యక్తిగా పేరు తెచ్చుకొని ఆంధ్ర కేసరిగా కీర్తి ప్రతిష్టలు పొందిన మహనీయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అబుబకర్, నాయకులు కుల్లాయిబాబు, స్వర్ణాంబ, షేక్షావలి, నారాయణరెడ్డి, చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పద్యాల పోటీలు

తాడిపత్రి, మే 20(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో సమ్మర్‌క్యాంప్‌లో భాగంగా మంగళవారం విద్యార్థులకు పద్యాలపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం గ్రంథాలయ అధికారి రవికుమార్‌నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తకపఠనం అలవరచుకోవాలన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

రాయదుర్గం రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి ప్రథమ సంవత్సరం డిగ్రీలో చేరడానికి అడ్మిషన్లు ప్రారంభించామని ప్రిన్సిపల్ రఘురామమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి కళాశాలలో అప్లికేషన్ పొంది దానికి అవసరమైన సంబంధిత జిరాక్స్ ధృవపత్రాలను అందజేయాలన్నారు. కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా కార్యాలయ సిబ్బంది అందుబాటులో ఉంటారని.. మరిన్ని వివరాలకు 7981482847, 9030260294, 9989660435 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

గుంతకల్లుటౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కొనకొండ్ల రోడ్డులో మంగళవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొని ఇద్దరు గాయపడ్డారు. కొనకొండ్లకు చెందిన ఎర్రిస్వామి ద్విచక్రవాహనంలో గుంతకల్లు స్వగ్రామానికి బయలుదేరాడు. చాబాల గ్రామానికి చెందిన రాము ద్విచక్రవాహనంలో గుంతకల్లుకు వస్తుండగా రెండు బైక్‌లు ఢీ కొన్నాయి. ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. వారిని 108 వాహనం ద్వారా గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పలుచోట్ల భారీ వర్షం.. నీట మునిగిన పంటలు

ఉరవకొండ, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలుచోట్ల వర్షం కురిసింది. దీంతో పంటలు నీటమునిగాయి. వజ్రకరూరు మండలం ప్యాపిలిలో గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు నీట మునిగాయి. ప్యాపిలిలో బోరుబావుల క్రింద టమోటా, బెండ, ఆముదం, వేరుశనగ పంటలు సాగు చేశారు. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పొలాల్లోకి వరదనీరు వచ్చి చేరింది. సుమారుగా రూ.4లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు.

● రాయదుర్గం: పట్టణంలో మంగళవారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. గంటపాటు ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలైన కొలిమిస్ట్రీట్, రామదాసప్పవీధి, మధు థియేటర్ ఏరియా ప్రాంతాలలో వరదనీరు ఉధృతంగా ప్రవహించాయి.

● గుమ్మఘట్ట : కర్ణాటక సరిహద్దులో గలగల పైదొడ్డి గ్రామం దద్ద మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి టమోటా పంట నీట మునిగి దెబ్బతింది. రైతులు తిప్పేస్వామి, గురుస్వామి మూడు ఎకరాలలో టమోటా సాగు చేశారు. వాగు ఉధృతంగా ప్రవహించి టమోటా పంట నీటి మునిగింది.

● కణేకల్లు: మండలవ్యాప్తంగా మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కాలనీలు భారీ నీటితో జలమయమయ్యాయి.

● బెళుగుప్ప: మండలంలోని మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గత రెండు మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పండ్ల తోటల రైతులు ఆందోళన చెందుతున్నారు. కోత కోస్తున్న అరటి, మామిడి, బొప్పాయి, మొక్కజొన్న ఇంటికి తెచ్చుకోలేకపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వజ్రకరూరు వద్ద దెబ్బతిన్న బెండ పంట, రాయదుర్గంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు, పైదొడ్డి వద్ద నీటమునిగిన టమోటా పంట, ప్రవహిస్తున్న వాగు

చెత్త నుంచి సంపద సృష్టించాలి : డీఎల్‌డీఓ



డంపింగ్‌యార్డుల నిర్వహణపై ఆరాతీస్తున్న డీఎల్‌డీఓ

యాడికి, మే 20(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టి లక్ష్యంగా డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలని గుంతకల్లు డీఎల్‌డీఓ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం మండలంలోని యాడికి, వేములపాడు, గుడిపాడు గ్రామ పంచాయతీల్లోని డంపింగ్ యార్డులను ఆమె పరిశీలించారు. డంపింగ్‌యార్డుల నిర్వహణపై అధికారులను ఆరాతీశారు. ఆయా గ్రామ సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో ఏర్పాటుచేసిన డంపింగ్‌యార్డుల నుంచి సంపద సృష్టించే విధంగా అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ వీరరాజు, డిప్యూటీ ఎంపీడీఓ శశికళ, కార్యదర్శి మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

● బొమ్మనహాళ్ : వర్మీకంపోస్టు ఎరువులు ఆ పంచాయతీకి ఆదాయ వనరులుగా మార్చుకోవాలని కళ్యాణదుర్గం డీఎల్‌డీఓ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని ఉంతకల్లు గ్రామంలో వర్మీకంపోస్టు యార్డును మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ దాస్, కార్యదర్శి పల్లవి, సర్పంచ్ ముక్కన్న పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూములను పరిశీలించిన అధికారులు

యాడికి, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిట్టూరు గ్రామంలో అగ్రిగోల్డ్ భూములను మంగళవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మండలంలో అగ్రిగోల్డ్ భూములు మొత్తం 63.43ఎకరాలు ఉన్నాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. అగ్రిగోల్డ్ భూములను ఎవరైనా సాగుచేశారా, ప్రస్తుతం వాటి పరిస్థితి ఏమిటనే అంశంపై ఆరాతీశారు. భూ ములను పరిశీలించిన వారిలో ఆర్‌ఐ కిష్టప్ప, వీఆర్వో వెంకటశివుడు ఉన్నారు.

వినతులను తక్షణమే పరిష్కరించాలి

యాడికి, మే20(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో తక్షణమే పరిష్కారం అయ్యేలా రెవెన్యూ సిబ్బంది కృషిచేయాలని తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం యాడికిలోని తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో తహశీల్దార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

31న రాతిదూలం లాగుడు పోటీలు

యల్లనూరు, మే20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపల్లిలో ఈనెల 31న రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. నూతనంగా నిర్మించిన వెంకటరమణస్వామి దేవాలయ ప్రారంభోత్సవ సందర్భంగా ఈ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. మొదటి బహుమతి రూ.1.20 లక్షలు, రెండో బహుమతి రూ.లక్ష, మూడో బహుమతి రూ.80వేలు, నాలుగో బహుమతి రూ.60వేలు, ఐదో బహుమతి రూ.40 వేలు, ఇతర బహుమతులు ఉంటాయన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ఆశావర్కర్ల నిరసన

తాడిపత్రి, మే 20(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆశావర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఉమాగౌడ్, జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు.

భగవద్గీత పోటీలు

పామిడి, మే 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనఘా అత్రేయ పాదుక క్షేత్రంలో మంగళవారం విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా రాజకుమార్ శర్మ, టీటీ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎం గీత, ఎస్ ఉమాబాయి వ్యవహరించారు. విజేతలకు ఈనెల 23వ తేదీన దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ జన్మదినోత్సవాన్ని పురష్కరించుకుని బహుమతులు అందచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు సీతమ్మ, లక్ష్మీనారాయణరెడ్డి, దత్త భోగేశ్వర విశ్వనాథ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి,మే20(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో గేట్స్ కళాశాల సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనం బోల్తా పడి ఇద్దరు తీవ్రంగా గాపడ్డారు. గార్లదిన్నెకు చెందిన శ్రీనివాసులు, రాములు ద్విచక్రవాహనంలో గుత్తి పట్టణానికి వస్తుండగా గేట్స్ కళాశాల వద్ద రాగానే ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం బోల్తా పడి ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీడీ కార్మికులకు స్థలాలివ్వాలి

తాడిపత్రి, మే20(ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులకు స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు సమస్యలపై తహసీల్దార్ రజాక్‌వలికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో కార్మిక సంఘం నాయకులు రహీం, బషీరున్, కేవీపీఎస్ నాయకులు నాగరాజు, రాంమోహన్, శ్రీరాములు, కుళ్లాయప్ప సీఐటీయూ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.